

ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 27.0

డిగ్రీ, పాలిటెక్నిక్ వెలవెల

అంతా ఇంజనీరింగ్, మెడిసిన్ వైపు వెళ్తుంటే ఇటు ప్రభుత్వం విద్యార్థుల కోసం ఏర్పాటుచేస్తున్న డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు విద్యార్థులు లేక వెలవెల పోతున్నాయి. తాడేపల్లిగూడెం పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్, సివిల్ కోర్సులలో ఎవరూ చేరని పరిస్థితి. ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు అయితే పది చదివితే పాలిటెక్నిక్‌లో సీటు ఇచ్చేస్తాం.. రండి బాబు అని ప్రచారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ఇంటర్మీడియట్ తర్వాత ఏమి చదవాలి ? విద్యార్థులకంటే ముందు వారి తల్లిదండ్రుల నుంచి వచ్చే సమాధానం ఇంజనీరింగ్, వైద్య విద్య. ఎన్నో కోర్సులు ఉన్నప్పటికీ కొన్ని కళాశాలలు విద్యార్థుల తల్లిదండ్రులను పూర్తిగా ప్రభావితం చేస్తున్నాయి. పిల్లలను ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేర్చేవిధంగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. కామర్స్, ఎకనామిక్స్ తదితర ఆర్ట్స్ గ్రూపు విద్యార్థులకు సీఏ మాత్రమే పరిచయం చేస్తున్నాయి. వాస్తవానికి సైన్స్ విద్యార్థులతోపాటు ఆర్ట్స్ విద్యార్థులకు సైతం ఉత్తమ కెరీర్‌నిచ్చే డిగ్రీ కోర్సులు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. జాతీయస్థాయి ప్రభుత్వ సంస్థలవైపు తల్లిదండ్రుల దృష్టి మళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాయి.

తాడేపల్లిగూడెంకు చెందిన శ్రీధర్ తాపీ పనిచేస్తుంటాడు. రోజు కూలీతోనే కుటుంబం గడుస్తుంది. ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు మూడేళ్ల క్రితం పదో తరగతి పూర్తి చేశాడు. తనలా కాకుండా కొడుకు జీవితం బాగుండాలని, భవిష్యత్‌లో మంచి ర్యాంకులు సాధించాలని ఫౌండేషన్ కోర్సులు నేర్పించే విజయవాడలోని ఓ కళాశాలలో రూ.3 లక్షలు కట్టి రెండేళ్లు ఇంటర్ చదివించాడు. కొడుకు భవిష్యత్ మాటెలా వున్నా శ్రీధర్ పది లక్షలు అప్పుల భారం మోయాల్సి వచ్చింది. ఐఐటీ సీటు సాధించే ర్యాంకు రాలేదు.. చేసిన అప్పులు మాత్రం మిగిలాయి. సాధారణ కాలేజీలో ఇంజనీరింగ్‌లో చేరాడు.

మరో తండ్రి కొడుకును డాక్టర్ చేయాలని కలలు కన్నాడు. అప్పులు చేసి పేరున్న కాలేజీలో ఇంటర్ బైపీసీలో చేర్చాడు. రెండేళ్లపాటు చదివించేందుకు మొత్తం ఏడు లక్షలు అప్పులు చేశాడు. నీట్‌లో వచ్చిన ర్యాంకుకు ఎంబీబీఎస్ సీటు ఎక్కడా రాదు. హోమియో, ఆయుర్వేదంలో సీట్లు వస్తాయి. కాని, తాను మాత్రం ఎంబీబీఎస్ మాత్రమే చేస్తానని ఏ ఇతర కోర్సుల్లోను చేరేది లేదని తండ్రికి చెప్పడంతో అతను లాంగ్ టర్మ్ కోచింగ్‌కు ఇప్పించేందుకు మరో రెండు లక్షలు ఖర్చు చేసి విజయవాడలో చేర్పించాడు. ఈసారి నీట్‌లో వచ్చిన ర్యాంకుకు అతనికి హోమియో, ఆయుర్వేద కోర్సుల్లో కూడా సీటు రాదు. చివరకు ఎంసెట్ రాసి పారా మెడికల్ కోర్సుల్లో చేరాడు. ఈ మూడేళ్లలకు కొడుకుపై పెట్టిన ఖర్చు అక్షరాలా పది లక్షలు.

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

ఇంజనీరింగ్.. మెడిసిన్
ఈ రెండే కాదు
జాతీయస్థాయిలో అందుబాటులో వందలాది కోర్సులు

వైద్య విద్యనభ్యసించాలని ఇంటర్మీడియట్ బైపీసీలో చేరిన నిత్యశ్రీకి కళాశాలలో ఆశించిన ప్రోత్సాహం లభించలేదు. నీట్‌తోపాటు కొన్ని జాతీయ సంస్థలు అందిస్తున్న కోర్సులు, ఏపీఈఏపీ సెట్‌తో అందుబాటులో వున్న కోర్సులు తెలుసుకుంది. అగ్రికల్చర్ బీఎస్సీ, బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ కోర్సుల ప్రవేశమే లక్ష్యంగా జాతీయస్థాయి టెస్ట్‌పై దృష్టి పెట్టింది. 2024 విద్యా సంవత్సరం సీయూఈటీ యూజీ రాసింది. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ అలహాబాద్, యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ సీట్లు కైవసం చేసుకుంది. సీయూఈటీ స్కోర్ ఆధారంగా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ ఇంజనీరింగ్ (బీటెక్) సీటు సాధించింది. అదే సంవత్సరం ఏపీఈఏపీ సెట్ ర్యాంక్‌తో జేఎన్‌టీయూ కాకినాడలో ఫుడ్ ఇంజనీరింగ్ (బీటెక్) సీటు సాధించింది. చివరికి ప్రతిష్ఠాత్మక ఢిల్లీ యూనివర్సిటీలో బీఎస్సీ (ఫుడ్ అండ్ న్యూట్రిషన్) కోర్సులో చేరింది. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలపై అవగాహన ఉంటే నీట్, ఈఏపీసెట్‌తోపాటు వీటిపైన దృష్టి పెట్టవచ్చని నిత్యశ్రీ వివరించింది. జాతీయస్థాయి ప్రవేశ పరీక్షకు ఏ సంస్థలో కోచింగ్ లేకుండా తాను స్వంతంగా సన్నద్ధమైనట్లు ఆమె చెబుతుంది.

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పిల్లల ఆసక్తి, వారి సామర్థ్యం ఆధారంగా ఉన్నత విద్యాభ్యాసానికి తల్లిదండ్రులు బాటలు వేయాలి. తమ ఆసక్తిని పిల్లలపై రుద్దకూడదు. అలాగే పిల్లలకు ఆసక్తి ఉన్నప్పటికీ ఆ కోర్సుల్లో వారు ఎంత వరకు నెగ్గుకొస్తారో కూడా తెలుసుకోవాలి. లేకుంటే పైన చెప్పిన రెండు ఉదాహరణలు మన ఇంటిలో కూడా ఎదురయ్యే అవకాశాలు ఉంటాయి. పిల్లల ఇంటర్ విద్యా భ్యాసం తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా మారింది. రెండేళ్లకు ఐదు లక్షలకు పైనే వెచ్చించాల్సి వస్తోంది. సాధారణ, మధ్య తరగతి కుటుంబాల్లో విద్యార్థులు టెన్త్ తర్వాత ఇంజనీరింగ్, మెడిసిన్‌పై మక్కువ చూపుతున్నారు. ఈ రెండు కోర్సులే జీవితం అన్నట్టు మారిపోయింది.

ఈ కోర్సులు మీకు తెలుసా ?

ఎంపీసీ గ్రూపు విద్యార్థులకు మొదటి లక్ష్యం జేఈఈ. ఇది సాధ్యం కాకుంటే ఏపీఈఏపీసెట్ ద్వారా ఇంజనీరింగ్ కోర్సులను చూపుతున్నారు. కొన్ని అవకాశాలు దక్కుతున్నా బైపీసీ విద్యార్థుల తల్లిదండ్రుల ఆశలతో విద్యా సంస్థలు విజయవంతంగా వ్యాపారం సాగిస్తున్నాయి. నీట్ ద్వారా వైద్య విద్య సీటు సాధించలేని విద్యార్థులు కార్పొరేట్లకు పెట్టుబడి. నీట్‌తో పాటు ఏపీఈఏపీ సెట్ రాయిస్తున్నారు. ఈ ర్యాంక్ ఆధారంగా లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు ఫీజు రాయితీలు ఇచ్చి విద్యార్థుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఇంటర్ తర్వాత జాతీయ స్థాయి విద్యా సంస్థల్లో ఇంజనీరింగ్, వైద్య విద్యకు ఏమాత్రం తగ్గని కోర్సులు అందుబాటులో ఉన్నా విద్యార్థుల తల్లిదండ్రులు దృష్టి పెట్టకపోవడం విచారకరం. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ యూజీ) ద్వారా సెంట్రల్ యూనివర్సిటీల్లో ఇంజనీరింగ్ (సీఎస్ఈ, ఈసీఈ, మెకానికల్, సివిల్)తో పాటు వ్యవసాయ విద్య, బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, డెయిరీ టెక్నాలజీ, సైన్స్, ఆర్ట్స్ డిగ్రీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

> విద్యార్థులు, తల్లిదండ్రుల ఆసక్తిని సొమ్ము చేసుకుంటున్న విద్యా సంస్థలు
> రెండు మూడు కోర్సులపైనే ప్రచారం..
> ఇదే జీవితం అన్నట్టు మార్చేసిన వైనం
> ర్యాంకుల పేరిట లక్షల్లో ఫీజులు
> భారంగా మారిన ఇంటర్ చదువులు



ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు మరో అద్భుతమైన విద్యా సంస్థ ఇండియన్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐఎస్ఈఆర్). జాతీయ స్థాయిలో ఐసర్ క్యాంపస్‌లు ఏడు ఉన్నాయి. నైసర్ ఒకే ఒక్క క్యాంపస్ ఉంది. ఏవియేషన్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్ (ఏఎంఈ), ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ (ఐఎస్ఐ) నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఎన్ఐఎఫ్‌టీ), కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (సీఎల్‌ఏటీ) ద్వారా న్యాయవిద్య, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ) తదితర జాతీయస్థాయి సంస్థల్లో ఉత్తమ కెరీర్ నందించే కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

జేబులు ఖాళీ

పది పరీక్షల తర్వాత పాసైన విద్యార్థుల తల్లిదండ్రులు విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల్లో కళాశాలల్లో ఇంటర్‌లో చేర్చేందుకు ఏడాదికి రూ.3 లక్షల చొప్పున చెల్లించుకోవాల్సిన పరిస్థితి. పిల్లల కోసం లక్షల్లో అప్పులు చేసి చదువుకొనాల్సిన వస్తోంది. ఐఐటీ, మెడిసిన్ సీట్లు సాధించిన వారి సంఖ్య మాత్రం తక్కువే.!

ప్రచార హోరు..

పదో తరగతి పాసైన విద్యార్థి ఉంటే కార్పొరేట్ కళాశాలలు ఆఫర్లు ఇస్తున్నాయి. పిల్లలకు భవిష్యత్‌పై ఆశలు చూపి తమ కళాశాలల్లో చేర్పించేలా చూస్తున్నాయి. గతంలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేసే కళాశాలలు ప్రస్తుతం తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లు సంపాదించి వారిని ఆకర్షించేలా ప్రచారం హోరెత్తిస్తున్నాయి.

నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థుల్లో

‘మెగా డీఎస్సీ’ మెరిసెన్

- తొలుత ప్రకటించిన పోస్టుల కంటే పెరిగిన నియామకాలు
- జిల్లా స్థాయిలో 1074, జోనల్ స్థాయిలో 348
- నోటిఫికేషన్ విడుదల

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామకాలకు నోటిఫికేషన్ ఆదివారం విడుదలైంది. తొలుత పాఠశాల విద్యా శాఖ పరిధిలోని ప్రభుత్వ/జడ్పీ/మండల పరిషత్/మునిసిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో జిల్లాస్థాయి నియామకాలకు ప్రకటించిన మొత్తం 1035 స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ కేడర్ టీచరు పోస్టులకు అదనంగా మరికొన్ని ఇతర శాఖల ఆధీనంలోని పాఠశాలకు కూడా మంజూరు చేసిన పోస్టులను కూడా చేర్చి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేశారు. జిల్లాలోని బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో నియామకాల కోసం మరో 32 పోస్టులు, జువెనైల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహిస్తోన్న ప్రభుత్వ బాలుర వసతిగృహం పాఠశాలకు 7 పోస్టుల భర్తీ కూడా నోటిఫికేషన్‌లో చేర్చారు. ఇవిగాక ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలు (జోన్-2) పరిధిలోని వివిధ సంక్షేమ శాఖలు నిర్వహించే రెసిడెన్షియల్/నాన్‌రెసిడెన్షియల్ పాఠశాలల్లో టీచరు నియామకాలకు ఉద్దేశించిన 348 పీజీటీ, టీజీటీ, పీడీ, పీఈటీ జోనల్ పోస్టులను కూడా తాజా డీఎస్సీలోనే చేర్చడం విశేషం. జోనల్ పోస్టుల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు (తరువాయి 8వ పేజీలో)

కొల్లేరు ప్రజలను సుప్రీం కోర్టు గుర్తించింది


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

- త్వరలో సీఈసీ కమిటీ కొల్లేరు గ్రామాల్లో పర్యటన
- 12 వారాల్లో కొల్లేరువాసుల జీవనశైలిపై నివేదిక

ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కొల్లేరులో ప్రజలు నివశిస్తున్నారన్న విషయం సుప్రీం కోర్టు దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారానికి ఒక అడుగు ముందుకు వేశామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. కొల్లేరు ప్రజలతో ఆదివారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో కొల్లేరులో ప్రజలు నివసిస్తున్నట్లు ఉన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లామని, కొల్లేరు స్థితిగతులను ప్రజల జీవనవిధానంపై 12 వారాల్లో నివేదిక ఇవ్వాలని సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ (సీఈసీ)ని కోరినట్లు తెలిపారు.

కొల్లేరు సాధనకు ప్రజలంతా ఐక్యతతో పార్టీలకతీతంగా కలిసి పనిచేయాలన్నారు. త్వరలో కొల్లేరులో సీఈసీ కమిటీ సభ్యులు పర్యటిస్తారని వారికి మన జీవనశైలిని, ప్రస్తుత స్థితిగతులను తెలియజేద్దామన్నారు. కొల్లేరు సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, బలే ఏసురాజు, సైదు సత్యనారాయణ, ఘంటసాల వెంకటలక్ష్మి, చింతపల్లి వెంకటనారాయణ, పెన్మెత్స త్రినాథ రాజు, తేరా రమేష్‌బాబు, కొల్లి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి మాఫియా



పంగిడిమ్మ చెరువులో మట్టి తవ్వకం

- చెరువుల్లో అక్రమ తవ్వకాలు
- ఏడాదికి రెండు కోట్లు డీల్!
- పట్టించుకోని యంత్రాంగం
- చెరువు లోతు పెరిగి రైతులకు నీరందని పరిస్థితి
- అధికార పార్టీ నేతల దందా

నూజివీడులో ఇటుక బట్టీల చెంతకు మట్టి

నూజివీడు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గంలో మట్టి మాఫియా బరి తెగించింది. గతంలో రైతు, గృహావసరాలకు చెరువుల్లో మట్టిని వినియోగించుకునేవారు. ఆ పేరుతో మట్టి మాఫియా చెరువుల్లో మట్టిని దూరప్రాంతాలకు, వెంచర్లకు విక్రయించేది. బయటకు పొక్కితే అక్రమ తవ్వకాలు ఆగిపోయేవి. కొద్ది నెలల నుంచి నూజివీడు నియోజకవర్గంలో మట్టి మాఫియా ఆగిరిపల్లి, నూజివీడు మండలాల్లో విస్తరిస్తోంది. ఆగిరిపల్లిలోని పలు గ్రామాలు, నూజివీడు మండలంలోని కొన్నంగుంట, బోర్వంచ, దేవరగుంట, జంగంగూడెం, రావిచర్ల, మొర్సపూడి గ్రామాల్లోని చెరువు మట్టి అక్రమంగా తరలివెళుతోంది. అక్రమ తవ్వకాల గురించి గ్రామస్తులు రెవెన్యూ, మైన్స్ అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోక పోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది రోజుల నుంచి ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామ సమీపంలో వందెకరాల విస్తీర్ణం గల పంగిడమ్మ చెరువుపై మట్టి మాఫియా కన్నుపడింది. అధికార పార్టీ చోటా నాయకులు కొందరు చెరువులో మట్టి అమ్మకాలు చేపట్టి సమీప ఇటుక బట్టీలకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మట్టి హోం డెలివరీ!

ఆగిరిపల్లి మండల సమీపంలోని అనేక గ్రామాల్లో పెద్ద సంఖ్యలో ఇటుక బట్టీలు ఉన్నాయి. బట్టీల నిర్వాహకులు మట్టిని సుదూర ప్రాంతాల నుంచి సొంత వాహనాల్లో మట్టిని తెచ్చుకునేవారు. శోభనాపురం, ఈదర, మాదలవారిగూడెం, సమీపంలోని మైలవరం మండలానికి చెందిన వెల్వడం, గణపవరం గ్రామాల్లో పెద్ద సంఖ్యలో ఉన్న ఇటుక బట్టీలవారితో మాఫియా కుమ్మక్కై కావాల్సిన మట్టిని అడిగిన సమయానికి బట్టీల వద్దకు పంపించడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ డీల్ ఏడాదికి రెండు కోట్లుగా వినిపిస్తోంది. మొన్నటివరకు చాటుమాటుగా అక్రమంగా మట్టిని కొనుగోలు చేసుకునే ఇటుక బట్టీలకు అధికార పార్టీ నేతలే హోం డెలివరీ చేస్తున్నారు. (తరువాయి 8వ పేజీలో)

23న పది పరీక్షా ఫలితాలు?

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు ఈ నెల 23న విడుదల కానున్నట్టు సమాచారం. ఫలితాలను విద్యార్థులు మనమిత్ర వాట్సాప్ నెంబరు 95223 00009కు హాయ్ సందేశం పంపడం ద్వారా అడిగిన సమాచారాన్ని నమోదుచేసి తెలుసుకోవచ్చు. దీంతోపాటు పాఠశాలల్లో అమలవుతున్న వివిధ కార్యక్రమాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, సెలవులు, తదితర కార్యకలాపాల సమాచారాన్ని నమోదుచేసేందుకు టీచర్లకోసం ప్రవేశపెట్టిన ‘లీప్’ యాప్‌లో కూడా పదో తరగతి పరీక్షా ఫలితాలు అందుబాటులో ఉంటాయి.

మార్చి 17న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు జిల్లాలో 25,179 మంది రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన బాల బాలికలు, దూరవిద్య విభాగంలో 793 మంది దరఖాస్తు చేసుకున్నారు. జవాబుపత్రాల మూల్యాంకనం ఈ నెల 3న ప్రారంభమై 9న ముగియగా, తదుపరి ప్రక్రియలు కూడా ముగింపుదశకు చేరుకున్నాయి. ఈ నెల 23న ఫలితాలు విడుదల చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నట్టు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ఫలితాల విడుదలపై అధికారిక ప్రకటన జారీ కావాల్సి ఉంది.

బదిలీల వేళాయె!

- ఇటీవల కొన్ని శాఖల్లో బదిలీలతో చర్చ
- విద్యా సంవత్సరం ముగుస్తుండడంతో మిగిలిన శాఖల్లో కూడా యత్నాలు

ఏలూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకోవడంతో అధికార, ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం అవుతోందా? అన్న ఆసక్తి నెలకొంది. జిల్లాలో రెవెన్యూ, సోషల్ వెల్ఫేర్, పురపాలకశాఖల్లో ఇటీవలే బదిలీలు చోటు చేసుకున్నాయి. జిల్లా సాంఘిక సంక్షేమశాఖ జేడీ వి.జయప్రకాష్ ఈ నెల 17న బదిలీ అయ్యారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏవో కృష్ణారావు బదిలీ కాగా, ఆయన స్థానంలో నగీనా సుల్తానా నియమితులయ్యారు. ఆర్ అండ్ బీ ఎస్ఈ పి.భరతరత్నం, చింతలపూడి మునిసిపల్ కమిషనర్ రాంబాబు ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఇంటర్ ఫలితాలు వెలువడగా, టెన్త్ ఫలితాలు రావాల్సి ఉంది. కింది తరగతులకు ఈ నెల 25లోగా ప్రోగ్రెస్ రిపోర్టుల జారీతో విద్యా సంవత్సరం ముగియనుంది. దీంతో అధికారికంగా అధికారులు, కింద స్థాయిల్లో ఉద్యోగులు బదిలీల ప్రక్రియకు ప్రభుత్వం కార్యాచరణకు దిగుతుందా అన్న చర్చ సాగుతోంది. ఇప్పటికే పలు శాఖల్లో అంతర్గత బదిలీలకు తెరలేపారు. డ్వామాలో ఇటీవల ఏపీవో, మండల స్థాయి ఉద్యోగుల బదిలీలకు జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా స్థాయిలో పలువురి అధికారులకు బదిలీలు తప్పవు. సంక్షేమశాఖ ఈడీగా మహిళా ఉద్యోగిని ఏడేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నారు. ఈ సారి బదిలీ ఖాయంగా కనిపిస్తోంది. అమరావతి సచివాలయంలో కీలకశాఖల్లో పోస్టుల భర్తీకి జిల్లా స్థాయిల్లోని అధికారులను తరలించడం వలన కూడా జిల్లాలో పలు శాఖల్లో ఖాళీలు పెరిగాయి. విద్యా సంవత్సరం ముగుస్తుండడంతో కొందరు అధికారులు తెర వెనుక ప్రయత్నాలు ముమ్మరం చేశారని సమాచారం.

పదోన్నతుల తర్వాత ఖాళీల భర్తీ..

ఇరిగేషన్ శాఖలో డీఈ పోస్టులను ఏఈలకు పదోన్నతులతో భర్తీ చేశారు. రెవెన్యూశాఖలో అడహాక్ పదోన్నతులు ఇవ్వాలన్న ఆదేశాలు అమలు కావడం లేదు. దీంతో సీనియర్ అసిస్టెంట్, ఇతర పోస్టులు ఖాళీలు అలానే ఉన్నాయి. పరిశ్రమలు, సర్వే, ఆర్ అండ్‌బీ లో ఏఈల కొరత, సంక్షేమ శాఖల్లో ఉద్యోగుల కొరత తీరాలంటే బదిలీ ప్రక్రియలు చేపట్టాల్సిన అవసరం ఉంది. గతేడాది ఆగస్టులో బదిలీలకు మార్గదర్శకాలను 16 శాఖల్లోనే ఇచ్చారు. ఇది అక్టోబరు వరకు కొనసాగింది. మధ్యంతర బదిలీలతో అధికారులు, ఉద్యోగులకు ఇబ్బందులు తప్పవు. ఈ నేపథ్యంలో ముందస్తు బదిలీల ప్రక్రియ చేయడమే ఉత్తమం.

పీజీఆర్ఎస్ వికేంద్రీకరణ అమలు

ఏలూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల స్వీకరణ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమం మండల, డివిజన్, మునిసిపల్ స్థాయిలో సోమవారం అమలు చేస్తున్నట్లు కలెక్టర్ కె వెట్రిసెల్వి ఆదివారం తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమర్పించాలని ఆమె చెప్పారు.



క్రీస్తు పునరుత్థానుడైన రోజు పురస్కరించుకుని క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను జరుపుకున్నారు. చర్చిలలో ప్రార్థనలు చేశారు. శ్మశాన వాటికలో పూర్వీకుల సమాధుల వద్ద ఆదివారం తెల్లవారు జామున ప్రార్థనలు నిర్వహించారు.
ముదినేపల్లి చర్చి వద్ద కొవ్వొత్తులతో క్రైస్తవుల ఏసు పునరుత్థాన ప్రార్థనలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు టీడీపీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంత్రి, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.



నూజివీడులోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మంత్రి కె.పార్థసారథి

ద్వారకాతిరుమల ఆలయంలో భక్తుల రద్దీ

7

లక్ష్మీపురంలో కల్యాణోత్సవాలు ప్రారంభం

పిల్లలకు ఇవి నేర్పించాలి..!

పిల్లలు బడిలో చదువుతున్నప్పుడే... తల్లిదండ్రులు వాళ్లకి చిన్న చిన్న ఇంటిపనులు చేయడం నేర్పించాలి. దీనివల్ల పిల్లలకు బాధ్యత, సహాయం చేయడం, ఆత్మవిశ్వాసం, విచక్షణా జ్ఞానం, సంఘటిత శక్తి విలువ అవగతమవుతాయి. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు దాన్ని పరిష్కరించుకునే సామర్థ్యం అలవడుతుంది. పిల్లలకు చిన్నతనంలోనే నేర్పించాల్సిన పనులు ఇవే...

- కూరగాయలు కడగడం-కోయడం, మసాలా దినుసుల వివరాలు- వాటి వినియోగం, వంటగది గట్టు తుడవడం, భోజనం వడ్డించడం, పాత్రలు కడగడం లాంటి పనులను పిల్లలకు చెప్పి చేయించాలి.
- నిద్ర లేవగానే దుప్పట్లు మడతపెట్టడం, పరుపు సర్దడం, ఉతికిన బట్టలు ఆరవేయడం-మడతపెట్టడం, బీరువాలో బట్టలు సర్దడం నేర్పించాలి.
- లైట్లు, ఫ్యాన్లు, టీవీ, సోఫా, అద్దం, ఇంట్లోని అలంకరణ వస్తువులను దుమ్ము లేకుండా తుడవడం నేర్పించాలి.
- ఇల్లు ఊడవడం, వ్యాక్యూమ్ క్లీనర్‌ను ఉపయోగించడం, చెత్తను పారిశుధ్య కార్మికులకు అందివ్వడం లాంటివి నేర్పించాలి.
- న్యూస్ పేపర్లు, పుస్తకాలను అరల్లో సర్దడం చూపించాలి.
- ఇంటికి కావాల్సిన కిరాణా సరుకుల లిస్ట్ రాయడం, బజారు నుంచి కూరగాయలు తీసుకురావడం లాంటివి నేర్పించాలి. ధరలు-నాణ్యతలపై అవగాహన కల్పించాలి
- ఇంటికి వచ్చిన అతిథులను పలుకరించడం, ఆదరించడం, గౌరవించడం నేర్పించాలి.
- టూత్‌బ్రష్‌లు, టూత్‌పేస్టు, షాంపూ, సబ్బులు తదితరాలను వినియోగించుకున్న తరవాత వాటిని యథాస్థానంలో ఉంచడం అలవాటు చేయాలి.
- ఇంట్లో బూజులు దులపడం, మొక్కలకు నీళ్లు పోయడం, పరిసరాల్లో చెత్తచెదారం లేకుండా శుభ్రం చేయడం లాంటి పనులు నేర్పించాలి.



వినూత్నం

పచ్చని ప్రకృతి నడుమ గుడారం వేసుకుని ప్రకృతి అందాలను ఆస్వాదించే 'క్యాంపింగ్' గురించి మనందరికీ తెలుసు. అయితే ఈ అనుభవానికి మరింత గ్లామర్‌ను జోడించి, సరికొత్త 'గ్లాంపింగ్' పోకడకు శ్రీకారం చుట్టింది కేరళకు చెందిన ఎలీనా థామస్. కొడైకెనాల్‌కు దగ్గర్లోని పూంబరాయ్ గ్రామంలో 'లక్స్‌గ్లాంప్' ఇకో రిసార్ట్స్‌తో వినూత్న గ్లాంపింగ్ అనుభవాలను పంచుతున్న ఎలీనా 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

గ్లాంపింగ్‌తో పర్యాటకానికి కొత్త కళ




నాకు చిన్నప్పటి నుంచి కొత్త ప్రదేశాలను సందర్శించడమంటే చాలా ఇష్టం. ఇదే ఆసక్తి పెళ్లయ్యాక కూడా కొనసాగింది. మా వారు యాంటోనీ థామస్‌తో కలిసి యూరప్ మొత్తం పర్యటించాను. నిర్జనమైన చల్లని ప్రాంతాల్లోని గాజు క్యాబిన్లు మొదలు ఆకట్టుకునే ఆల్పైన్ లాడ్జీలు, డోమ్స్, బబుల్ రిట్రీట్స్‌లో కూడా బస చేశాం. కానీ ఇలాంటి అనుభవాన్ని అందించే సౌకర్యవంతమైన బసలేవీ మన దేశంలో నాకు కనిపించలేదు. ఎలాంటి పర్యాటక ప్రాంతానికి వెళ్లినా పూర్తి విలాసవంతమైన హోటళ్లు లేదా ప్రాథమిక వసతులు కూడా లేని క్యాంపింగ్ గుడారాలు మాత్రమే మాకు కనిపించాయి. కానీ పిల్లలతో, పెద్దలతో కలిసి ఒక ప్రశాంతమైన ప్రాకృతిక ప్రదేశంలో కొన్ని రోజులు సురక్షితంగా గడపాలనుకుంటే, అందుకు తగిన ఏర్పాట్లు బసలో ఉండి తీరాలి. ఆ బస అందమైన ప్రకృతి మధ్యలో ఉండాలి. దాన్లో అన్నిరకాల ఆధునిక సదుపాయాలూ ఉండాలి. ఆ ఆలోచనతో గ్లాంపింగ్‌లో భాగంగా 2018లో 'లక్స్‌గ్లాంప్'కు శ్రీకారం చుట్టాం!

మాది కేరళలోని త్రిస్సూరు. నేను ఎమ్‌బిఎ చదివాను. మా వారు యాంటోనీ థామస్, బిజినెస్ డెవలపర్. వృత్తి రీత్యా మేం దుబాయ్‌లో స్థిరపడ్డాం! లగ్జరీతో పాటు క్యాంపింగ్ అర్థం స్ఫురించేలా మా ఇకో రిసార్ట్‌కు లక్స్‌గ్లాంప్ అనే పేరును ఎంచుకున్నాం.

ప్రకృతి, విలాసాలు కలగలసి...

బస కోసం సంప్రదాయ నిర్మాణాలకు బదులుగా డోమ్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించుకున్నాం. అందుకోసం పచ్చని ప్రకృతికి ఆలవాలమైన కొడైకెనాల్, మున్నార్‌లలో లక్స్‌గ్లాంప్‌లను నెలకొల్పాం. దక్షిణ భారతదేశంలో ఇలాంటి డోమ్ నిర్మాణాలు ఎక్కడా లేవు. కాబట్టి ఈ వినూత్నమైన డోమ్ స్ట్రక్చర్స్ నిర్మించడం కోసం ఎంతో కష్టపడ్డాం. ముడి సరుకులన్నిటినీ చైనా, బాలిల నుంచి దిగుమతి చేసుకున్నాం. ఎక్కడా రాజీ పడకుండా, అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా కుటుంబమంతా సౌకర్యంగా బస చేయడానికి తగిన ఏర్పాట్లను డోమ్స్‌లో కల్పించాం. ప్రత్యేకించి లక్స్‌గ్లాంప్ కోసం, కొడైకెనాల్‌కు పాతిక కిలోమీటర్ల దూరంలోని పూంబరాయ్ గ్రామాన్ని ఎంచుకోడానికి కూడా ప్రత్యేక కారణం ఉంది. కోలాహలానికి దూరంగా ప్రశాంతమైన పరిసరాలను వెతుక్కుంటూ కొడైకెనాల్ చేరుకున్నప్పుడు మాకీ కొండ ప్రాంతం కనిపించింది. అప్పట్లో ఈ ప్రాంతమెంతో వెనకబడి ఉంది. సరైన రోడ్డు సదుపాయాలు కూడా లేవు. కానీ శ్రమకోడ్చి లక్స్‌గ్లాంప్‌ను నిర్మించిన తర్వాత, పర్యాటకుల తాకిడి పెరగడంతో ఈ గ్రామానికి కొత్త కళ చేకూరింది. ప్రయాణ సదుపాయాలు కూడా పెరిగాయి. కొందరు స్థానికులకు లక్స్‌గ్లాంప్‌లో ఉద్యోగాలు కూడా కల్పించాం.



వైఫై, టివి లేకుండా....

లక్స్‌గ్లాంప్‌లో బస చేసే అతిథులకు కల్తీ లేని ప్రాకృతిక అనుభవాన్ని అందించాలన్నది మా సంకల్పం. కాబట్టి అత్యవసరమైనప్పుడు మినహా వైఫై సదుపాయాలను అందించకూడదని నిర్ణయించుకున్నాం. అతిథులను ప్రకృతికి మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతోనే డోమ్స్ లోపల టివి సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయలేదు. భవిష్యత్తులో ఇదే తరహా గ్లాంపింగ్ నిర్మాణాలను భారతదేశంలోని మరిన్ని పర్యాటక ప్రదేశాలకు విస్తరించాలన్నది మా సంకల్పం.

• గోగుమళ్ల కవిత

కస్తూరి పుచ్చకాయ మిల్క్‌షేక్!

వేసవిలో తియ్యని కస్తూరి పుచ్చకాయలు (మస్క్ మిలన్) లభిస్తాయి. వీటిలో పీచుపదార్థం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఆరోగ్యానికి మంచిది. వీటికి వేసవి తాపాన్ని తగ్గించే శక్తి కూడా ఉంటుంది. ఈ కస్తూరి పుచ్చకాయతో మిల్క్‌షేక్ ఎలా చేయాలో తెలుసుకుందాం..

తయారీ విధానం

- బాగా పండిన కస్తూరి పుచ్చకాయను తీసుకొని.. దాని లోపల ఉన్న గుజ్జును మిక్సీలో వేసి బాగా తిప్పాలి. దానిలో ఒక గ్లాసు చల్లటి పాలను, తేనెను, పావు స్పూను వెనీలా ఎసెన్స్‌ను వేసి మరో సారి తిప్పాలి.
- దీనిని ఐస్ ముక్కలు వేసిన ఒక గ్లాసులో పోయాలి. మిల్క్‌షేక్ చిక్కగా కావాలనుకొనేవారు పాలను ఫ్రీజర్‌లో పెట్టి .. అది గట్టిపడిన తర్వాత నేరుగా మిక్సీలో వేయవచ్చు.
- పిల్లలకు ఇచ్చే సమయంలో కొద్దిగా ఐస్‌క్రీమ్ వేస్తే రుచి ఇంకా పెరుగుతుంది.



బరువు ఎప్పుడు చూసుకోవాలి..?

మనం సరిగ్గా ఎంత బరువున్నామో తెలియాలంటే విధిగా కొన్ని నియమాలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. వాటి గురించి తెలుసుకుందాం...



- ఉదయం పూట నిద్ర లేవగానే ఖాళీ కడుపుతో బరువును పరీక్షించుకోవాలి. అప్పుడే సరైన బరువు తెలుస్తుంది.
- వారానికి ఒకసారి బరువును పరీక్షించుకోవడం మంచిది. ప్రతిరోజూ శరీరంలో నీటి శాతం, ఆహారం తీసుకునే విధానం మారుతూ ఉంటాయి. వీటివల్ల బరువులో హెచ్చు తగ్గులు కనిపించవచ్చు. కాబట్టి ప్రతిరోజూ బరువు చూసుకోకూడదు.
- ప్రతీ వారం... ఒకే రోజున ఒకే సమయానికి ఒకే దుస్తులు ధరించి పరీక్షించుకుంటే కచ్చితమైన బరువు తెలుస్తుంది.
- నెలసరి సమయంలో హార్మోన్ల మార్పుల కారణంగా శరీరంలో నీరు నిలుస్తుంది. కడుపు ఉబ్బరంగా కూడా అనిపిస్తూ ఉంటుంది. ఈ సమయంలో బరువు చూసుకోకూడదు.
- మలబద్ధకం ఉన్న సమయంలో కూడా బరువు చూడకూడదు. తరచూ నీళ్లు తాగుతూ పీచుపదార్థాలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటూ సమస్య తీరిన తరవాత మాత్రమే బరువు చూసుకోవాలి.
- రాత్రి పూట పడుకునేముందు బరువు చూడకూడదు.
- భోజనం చేసిన వెంటనే బరువు పరీక్షించుకోకూడదు. తిన్న తరవాత కనీసం పన్నెండు నుంచి ఇరవై గంటలు ఆగిన తరవాతే బరువు చూసుకోవాలి.

అందమైన చర్మం కోసం పానీయాలు..!

సరైన పోషకాలు అందినప్పుడే చర్మం అందంగా కనిపిస్తుంది. ఈ వేసవిలో ఆరోగ్యకరమైన పానీయాలు సేవించి చక్కని చర్మాన్ని సొంతం చేసుకోవచ్చు. చర్మాన్ని మెరిపించే పానీయాలు ఇవే...

- ఎండాకాలంలో తేనె కలిపిన గ్రీన్ టీ తాగడం మంచిది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని టాక్సిన్లను బయటికి పంపుతాయి. దీంతో చర్మం మృదువుగా మారుతుంది.
- ఒక గ్లాసు నీటిలో రెండు చెంచాల నిమ్మరసం, ఒక చెంచా అల్లం రసం కలుపుకుని తాగితే చర్మానికి కొత్త కాంతి లభిస్తుంది.
- ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లలో ఒక చెంచా కలబంద జ్యూస్ కలుపుకుని తాగితే చర్మం తేమగా ఉంటుంది. ఎండ వల్ల కమిలిన చర్మం యథాస్థితికి వస్తుంది. ముఖం మీద మొటిమలు రావు.
- ఒక గ్లాసు వేడి నీళ్లలో చిటికెడు పసుపు వేసుకుని తాగితే చర్మం బిగుతుగా మారుతుంది. పసుపులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మ సమస్యలను నిరోధిస్తాయి.
- వేసవికాలంలో వారానికి రెండుసార్లు నారింజ రసం తాగుతూ ఉంటే కొల్లాజెన్ ఉత్పత్తి పెరిగి చర్మం మీద ముడతలు మాయమవుతాయి.



- ప్రతిరోజూ క్యారెట్ జ్యూస్ తాగడం వల్ల ఎ, కె, సి విటమిన్లు అంది చర్మం ప్రకాశవంతంగా కనిపిస్తుంది.
- పుచ్చకాయలో ఎక్కువగా నీరు ఉంటుంది. కొద్దిగా ఫైబర్, గ్లూకోజ్ తదితరాలు కూడా ఉంటాయి. తరచూ పుచ్చకాయ రసం తాగుతూ ఉంటే చర్మం ఛాయగా ఉంటుంది.
- ప్రతిరోజూ కీర దోస జ్యూస్ తాగితే...చర్మం పొడిబారకుండా ఉంటుంది.

ఆత్మస్థైర్యమే ఆయుధంగా...

బాల్యమంతా కష్టాలు... వైవాహిక జీవితం క్షణక్షణం నరకం. 34 ఏళ్ల వయసులో ముగ్గురు పిల్లలతో వీధిన పడిన నీతా... విధిని ఎదిరించి నిలిచారు. పురుషుల ఆధిపత్యం ఉన్న రవాణా రంగంలో... పదమూడు బస్సుల యజమానిగా తనదైన గుర్తింపు సాధించారు. సమాజ సేవలో కూడా 'నేను సైతం' అంటున్న నీతా ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...



"చిన్న వయసులో నా తోటి పిల్లలను చూస్తే నాకు చాలా అసూయగా ఉండేది. వారిలో వెల్లివిరిసే సంతోషం నాకు లేనందుకు బాధ కలిగేది. ఎందుకంటే... ఏ రోజూ రాత్రి మా అమ్మ చేతుల్లో తన్నులు తినకుండా, ఏడవకుండా నేను నిద్రపోలేదు. మా నాన్న రోజూ తాగి వచ్చి అమ్మను కొట్టేవాడు. అతణ్ణి ఎదిరించలేని నిస్సహాయతను అమ్మ నా మీద ప్రదర్శించేది. నేను పుట్టకపోయినట్టైతే... తను ఎప్పుడో ఈ లోకాన్ని వదిలేసేదాన్ని అని అనేది. నాకు ఆరేళ్ళ వయసున్నప్పుడు... నాన్న వేధింపులు భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకుంది. నాన్న నన్ను పెంచలేనంటూ మా తాతయ్య ఇంట్లో వదిలేశాడు.

నిత్యం వేధింపులే...

మాది మహారాష్ట్రలోని ఒక పల్లెటూరు. బడికి వెళ్ళింది తక్కువే. అయితే చదవడం, రాయడం బాగానే నేర్చుకున్నాను. పెద్ద చదువులు చదివించే స్తోమత మా తాతయ్యకు లేదు. పద్నాలుగేళ్ళ వయసులో నాకు పెళ్ళి చేసి భారం దించుకున్నారు. అప్పటికి నా భర్తకు ఇరవై రెండేళ్ళు. ఏడాదికే మొదటి బిడ్డను కన్నాను. ముంబయిలోని అత్తవారింటికి వెళ్ళాక... నా బతుకూ మా అమ్మలాగే అయింది. నా భర్త కూడా రోజూ తాగేసి వచ్చేవాడు. నన్ను నానా మాటలతో వేధించేవాడు. దురలవాట్ల కారణంగా అతనికి పని దొరికేది కాదు. దాంతో డిప్రెషన్‌కు గురయ్యాడు. మాకు ముగ్గురు పిల్లలు. ఒక మురికివాడలో మా నివాసం. కుటుంబ పోషణ భారం నా మీదే పడింది. ఒక స్కూల్‌లో ఆయాగా చేరాను. స్కూల్ బస్సులో పిల్లలను ఇళ్ళ దగ్గర నుంచి బడికి తీసుకువెళ్ళి, తిరిగి వారి ఇళ్ళ దగ్గర దింపడం నా బాధ్యత. ఆ సమయంలోనే తోటి ఆయాల దగ్గర స్కూటర్ నడపడం నేర్చుకున్నాను. నా ఉత్సాహం చూసి... స్కూల్ వ్యాన్లు, బస్సులు నడపడం అక్కడి డ్రైవర్లు నేర్పించారు. ఇదంతా నా భర్తకు నచ్చలేదు. ఆయా పని మానేయాలని గొడవ చేసేవాడు. నిత్యం శారీరకంగా, మానసికంగా హింసించేవాడు. ఇదే పరిస్థితి కొనసాగితే... పిల్లల బతుకు కూడా నా మాదిరిగానే అవుతుందనుకున్నాను. వారికి మంచి భవిష్యత్తు కావాలంటే ఈ వాతావరణంలో వాళ్ళు పెరగకూడదనిపించింది. అలా పెళ్ళైన ఇరవై ఏళ్ళ తరువాత నా భర్తను విడిచి పెట్టాలని నిశ్చయించుకున్నాను.

ఎనిమిదేళ్ళ శ్రమ

భర్తను వదిలి వచ్చాక ఎన్నో ఇబ్బందులు ఎదురైనా... ఏనాడూ ఆత్మస్థైర్యాన్ని కోల్పోలేదు. నేను నేర్చుకున్న డ్రైవింగ్ నాకు ఆసరాగా నిలిచింది. లైసెన్స్ తీసుకున్నాను. నేను పని చేస్తున్న స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి... వ్యాన్ డ్రైవర్‌గా కొత్త జీవితం మొదలుపెట్టాను. నా భర్త, అతని మిత్రులు నన్ను రకరకాలుగా వేధించారు. అనరాని మాటలెన్నో అన్నారు. డ్రైవర్‌గా పనిచేసే మహిళ అంటే సమాజానికి కూడా చిన్నచూపు ఉంటుంది. అయినా నేను కుంగిపోలేదు. పని ఉండని సమయాల్లో నా పిల్లలతో కలిసి చదువుకోవడం మొదలుపెట్టాను. బ్యాంక్ అధికారులను కలిసి, నా కథ చెప్పాను. వ్యాన్ కొనుగోలు చేయడానికి రుణం ఇవ్వాలని కోరాను. మా స్కూల్ యాజమాన్యం హామీతో రుణం మంజూరయింది. కొత్త ప్రయాణం ఆరంభమయింది. నా భర్తతో విడాకులు తీసుకున్నాను. పిల్లల చదువుకు, మేము జీవించడానికి అయ్యే ఖర్చులు మినహా... మిగిలిన డబ్బును పొదుపు చేశాను. అప్పును సకాలంలో తీర్చడంతో... బస్సు కొనుగోలుకు రుణం దొరికింది. అప్పుడే 'శ్రీ నీతా ట్రావెల్స్' పేరిట ఒక సంస్థను ప్రారంభించాను. దాదాపు ఎనిమిదేళ్ళపాటు నేను పడ్డ శ్రమ ఫలితాన్ని ఇచ్చింది. ఇప్పుడు మా ట్రావెల్స్ ద్వారా పదమూడు బస్సులు నడుపుతున్నాను. ఎక్కువశాతం బడిపిల్లల కోసమే తిరుగుతాయి. వాటిద్వారా ముప్పై మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాను.



ధైర్యంగా నిలబడాలి...

మరోవైపు నేను నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేరింది. నా పిల్లలు బాగా చదువుకున్నారు. మా అబ్బాయి కెనడాలో స్థిరపడ్డాడు. అమ్మాయిలిద్దరూ నాకు వ్యాపారంలో సాయం చేస్తున్నారు. నేను డిగ్రీ పూర్తి చేశాను. మా ట్రావెల్స్‌కు సంబంధించిన అన్ని వ్యవహారాలు నేనే చూస్తాను. 'నీతా ఫౌండేషన్' పేరుతో ఒక సంస్థను స్థాపించి... పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నాను. ఇప్పుడు నన్ను కలిసే అమ్మాయిల్లో చాలామంది నేనే వారికి స్ఫూర్తి అని చెబుతూ ఉంటారు. మీలా ధైర్యంగా ఉండాలని కోరుకుంటూ ఉంటామంటారు. ధైర్యంగా నిలబడితే అనుకున్నవి సాధించగలమని నేను చెబుతాను. పెళ్ళి అనేది మహిళలకు అంతిమ గమ్యంగా సమాజం పరిగణిస్తుంది. వైవాహిక జీవితంలో హింసకు గురైనవారిలో ఎంతోమంది దాన్ని మౌనంగా భరిస్తున్నారు. లోకం ఏమనుకుంటుందోననే భయం, ఆర్థికపరమైన అభద్రత, పిల్లల భవిష్యత్తుపై బెంగ... ఇలా దీనికి ఎన్నో కారణాలున్నాయి. తలరాతను తిట్టుకుంటూ, కష్టాలను భరించినంత కాలం... జీవితం మరింత దుర్భరంగా మారుతుందే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదు. విధిని ఎదిరించి పోరాడితేనే గెలుపు అందుతుంది. దానికి నేనే ఉదాహరణ."

అల్లంతో కొలెస్ట్రాల్‌కు చెక్

శరీరంలో చెడు కొలెస్ట్రాల్ చేరడం వల్ల పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా రక్తప్రసరణ వ్యవస్థ మందగిస్తుంది. దీంతో శరీర భాగాలకు రక్తాన్ని పంపడం కోసం గుండె ఎక్కువగా కష్టపడాల్సి వస్తుంది. క్రమంగా గుండె బలహీనమవుతుంది. ఇలాంటి పరిస్థితులకు కారణమైన చెడు కొలెస్ట్రాల్‌ను నివారించడానికి అల్లం ఉపకరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అల్లాన్ని ఎలా వాడాలో తెలుసుకుందాం...



- అల్లాన్ని శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా కోసి మెత్తని పేస్టులా చేయాలి. ఒక గిన్నెలో ఒక గ్లాసు నీళ్లు పోసి అందులో ఒక చెంచా అల్లం పేస్టు వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే ఈ నీటిని బాగా మరిగించి గ్లాసులో పోసుకుని మెల్లగా తాగాలి. ఇలా వారానికి రెండుసార్లు తాగుతూ ఉంటే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది.
- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో ఒక గ్లాసు నీళ్లు పోసి అయిదు అల్లం ముక్కలు వేసి బాగా ఉడికించాలి. తరవాత ఈ నీళ్లను గ్లాసులోకి వడబోసి అందులో మూడు చెంచాల నిమ్మరసం కలుపుకొని తాగాలి. వారానికి ఒకసారి ఇలా తాగితే గుండె సిరల్లో పేరుకున్న కొలెస్ట్రాల్ కరిగిపోతుంది.
- ఒక అంగుళం పొడవున్న అల్లం ముక్కను సన్నగా తురమాలి. ఈ అల్లం తురుములో ఒక చెంచా బెల్లం పొడి కలపాలి. ఈ మిశ్రమాన్ని ఉదయాన్నే ఖాళీ కడుపుతో తింటే శరీర భాగాల్లో పేరుకున్న చెడు కొలెస్ట్రాల్ తొలగిపోతుంది. బెల్లానికి బదులు తేనె కూడా కలుపుకోవచ్చు.
- అల్లాన్ని చిన్న ముక్కలుగా కోసి కొద్దిగా ఆరబెట్టాలి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో రెండు అల్లం ముక్కలను నోట్లో వేసుకుని నములుతూ రసాన్ని మెల్లగా మింగాలి. తరచూ ఇలా చేస్తూ ఉంటే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పేరుకోదు. గుండె ఆరోగ్యంగా పనిచేస్తుంది.
- ఉదయాన్నే టీ పెట్టుకునేటప్పుడు అందులో చిన్న అల్లం ముక్కను కచ్చాపచ్చాగా దంచి వేయాలి. ఈ అల్లం టీ తాగడం వల్ల కూడా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ఏర్పడదు. ఒక గ్లాసు మజ్జిగలో కొద్దిగా అల్లం తురుము కలుపుకుని తాగినా మంచి ఫలితం ఉంటుంది.

ఘనంగా సీఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్‌లు కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. ఆసుపత్రుల్లో పాలు, పండ్లు పంపిణీ చేశారు. సీఎం సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని, రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని సర్వమత ప్రార్థనలు చేశారు.


ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని


ఏలూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి, పార్టీ శ్రేణులు


వెంపలో సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న రామచంద్రరాజు


భీమవరంలో కేక్‌ను కట్ చేస్తున్న శ్రీనివాసవర్మ, అంజిబాబు, తోట, మంతెన రామరాజు, పార్టీ నాయకులు



భీమడోలులో గన్ని వీరాంజనేయులుకు కేక్ తినిపిస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు

సమగ్రశిక్ష సెక్టోరల్ ఆఫీసర్ పోస్టులకు ఎస్జీటీలూ అర్హులే !

» జిల్లా ప్రాజెక్టులో ఖాళీల భర్తీకి త్వరలో నోటిఫికేషన్

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రెగ్యులర్ అధికారుల పర్యవేక్షణ లేక ఇన్‌చార్జిల మొక్కుబడి పర్యవేక్షణలో ఏళ్ల తరబడి ఆలనాపాలన లేకుండా మూలనపడ్డ సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టుకు ఎట్టకేలకు పూర్తిస్థాయి సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ అధికారులను నియమించేందుకు వీలుగా ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇప్పటివరకు ఆయా కేడర్ల ఖాళీల భర్తీకి స్కూల్ అసిస్టెంట్, హెచ్‌ఎంలనే పరిమితంచేయగా, తాజాగా విడుదల చేసిన నియమ నిబంధనల్లో అర్హతలను సడలించి ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖ నిర్వహించే వలు పథకాలు, కార్యక్రమాల అమలు, పర్యవేక్షణకు సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ నేతృత్వంలో విధులు నిర్వర్తించే సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ అధికారులదే కీలకపాత్ర. ముఖ్యంగా కొందరు ఇన్‌చార్జి సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ అధికారులు ఎవరికివారే యమునాతీరే అనే రీతిలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయా వెకెన్సీల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేసినా పూర్తి చేయలేకపోవడం, ఈలోగా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సిఫారసులతో ప్రాజెక్టులో తిష్టవేసినవారు. కనీసం రోజువారీ విధుల్లో భాగంగా పాఠశాలలను సందర్శించడం వంటివి లేకుండాపోయాయి. ఈక్రమంలో ఏళ్ల తరబడి ఆయా వెకెన్సీలు ఇన్‌చార్జిల మొక్కుబడి పర్యవేక్షణలోనే కునారిల్లుతున్నాయి. గురువారం విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు కొద్ది రోజుల్లోనే సమగ్రశిక్ష జిల్లాప్రాజెక్టులో ప్రస్తుతం అందుబాటులోవున్న ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలచేయడానికి అధికారులు రంగం సిద్ధంచేశారు.

ఈ మేరకు నోటిఫికేషన్ జారీకి అనుమతి కోసం ఫైలును సోమవారం కలెక్టర్‌కు పంపనున్నారు. జిల్లా ప్రాజెక్టులో ప్రస్తుతం ఏఎల్‌ఎస్ కో-ఆర్డినేటర్, సీఎంవో, ఉర్దూ ఏఎంవో, రెండు ఏఎస్‌వో పోస్టులు ఖాళీగాఉన్నాయి. ఈ పోస్టులన్నింటికీ సవరించిన నిబంధనల ప్రకారం ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్ స్కిల్స్ కలిగి ఉండి, 55 ఏళ్లలోపు వయస్సువున్న ఉపాధ్యాయులందరూ నిర్ణీత మార్గదర్శకాలకు లోబడి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు.

మూడు రోజుల ముందుగానే విద్యార్థుల 'బదలాయింపు'!

» నేటి నుంచి కొత్త క్లాసుల్లో బాలబాలికలు !
» కొత్త అడ్మిషన్ల బాధ్యత టీచర్లదే
» అంగన్‌వాడీ చిన్నారులంతా ప్రభుత్వ పాఠశాలల్లోకి 'బదిలీ'
» 23 వరకు ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్



ఏలూరు అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ఒక్కరు కూడా ప్రైవేటు పాఠశాలలవైపు తరలిపోకుండా చేయడం, అదేసమయంలో కొత్తగా అడ్మిషన్ల సంఖ్యను పెంచుకునే లక్ష్యంలో భాగంగా సోమవారం నుంచి మూడు రోజులపాటు ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతీ ఉపాధ్యాయుడు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొనేలా ఆదేశాలు, మార్గదర్శకాలు జారీచేసింది. దీనికి ఎంఈవోలు, స్కూల్స్ హెచ్‌ఎంలను పర్యవేక్షకులుగా బాధ్యతలు అప్పగించింది. ఆ ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న బాలబాలికలను తదుపరి పైతరగతుల్లో సోమవారం నుంచి బుధవారం వరకు కూర్చోబెట్టే బాధ్యతలను క్లాసు టీచర్లకు నిర్దేశించింది. ప్రస్తుత విద్యాసంవత్సరానికి చివరి పనిదినం బుధవారమేనన్న విషయం విదితమే. ఆ వెంటనే వేసవి సెలవులు ఉంటాయి. ఈ విధంగా వేసవి సెలవులకు ముందే తదుపరి పైతరగతుల్లో విద్యార్థులను కూర్చోబెట్టడంతో పాటు, వార్షిక పరీక్షల ప్రోగ్రెస్ రిపోర్టులను బాలబాలికల తల్లిదండ్రులకు ఇవ్వాలని సూచించింది. కొత్త క్లాసుల్లో కూర్చున్న విద్యార్థులంతా వేసవిసెలవులు ముగిసిన అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమయ్యే రోజున (జూన్12) ప్రమోటైన క్లాసులోనే కూర్చునేలా పర్యవేక్షించాల్సిన బాధ్యతలు టీచర్లే తీసుకోవాలని కోరింది.

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతివరకు చదువుతున్న మొత్తం విద్యార్థులు 2,27,629 మంది కాగా, వీరిలో 1,609 ప్రభుత్వ పాఠశాలల్లో బాలబాలికలు 1,11,483 మంది ఉన్నారు. వీరంతా తదుపరి పైతరగతుల్లో కూర్చున్న సమాచారం, ఒకవేళ పాఠశాల మారితే ఏయే స్కూళ్లలో అడ్మిషన్ తీసుకుంటున్నారో సమగ్ర సమాచారం హెచ్‌ఎంల వద్ద ఉండాల్సిందేనని ఆదేశించారు. స్థానికంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా అడ్మిషన్లు పెరగడానికి టీచర్లు విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చజెప్పి చేర్చుకోవాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

అంగన్‌వాడీ బాలలకు ఒకటో తరగతిలో అడ్మిషన్లకు చర్యలు

ప్రాథమిక విద్యకు పునాదిగా భావించే ఒకటో తరగతిలో అడ్మిషన్లు సంతృప్తికరస్థాయిలో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వప్రాథమిక విద్య (ప్రీ ప్రైమరీ-1,2/ ఎల్‌కేజీ, యూకేజీ) చదువుతున్న బాలల్లో ఐదేళ్ల వయస్సు దాటిన వారందరినీ సోమవారమే సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేర్పాల్సిన బాధ్యతలను అంగన్‌వాడీ టీచర్లకు అప్పగించింది. ఈ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను పర్యవేక్షించాల్సిందిగా ఎంఈవోలు, సీఎంఆర్‌టీలను ఆదేశించింది. జిల్లాలో 1,959 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 266 మినీ అంగన్‌వాడీ కేంద్రాలుండగా, వీటిలో మొత్తం 13,052మంది బాలలు పూర్వప్రాథమికవిద్యను అభ్యసిస్తున్నారు. ఈ క్రమంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించే మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో కూడా ఒకటో తరగతిలోకి కొత్త అడ్మిషన్లపై దృష్టిసారించాలని సూచించారు.


పాలకోడేరు శివారు రాశి కాలువ గట్టుపై ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

పాలకోడేరు కాలువ గట్టుపై ఆక్రమణల తొలగింపు

» 108 గృహాలకు గాను 46 తొలగింపు.. బాధితుల గగ్గోలు

పాలకోడేరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పాలకోడేరు శివారు రాశి కాలువ గట్టుపై ఉన్న ఆక్రమణలను రెండోరోజు ఆదివారం రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలో పోలీసులు ఆక్రమణలను తొలగించారు. ఈ కాలువ గట్టుపై సుమారు 40 ఏళ్లుగా నివశిస్తున్నప్పటికీ ఈ ప్రాంతం పంటబోదెకు చేర్చి ఉండడంతో కొంతమంది రైతులు తమ పంట పొలాలకు ఇబ్బంది ఏర్పడుతుందంటూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆరు నెలలుగా ఈ ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు సిద్ధపడ్డారు. స్థానికులు ఎప్పటినుంచో ఉంటున్నామంటూ కోర్టును ఆశ్రయించడంతో జాప్యం ఏర్పడింది. దీనిలో భాగంగానే శనివారం ఆక్రమణలను తొలగించేందుకు సిద్ధపడగా ఆక్రమణదారుల నుంచి ప్రతిఘటన ఎదురైంది. ఆదివారం ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసు బలగాలను మోహరించి నాలుగు ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లను ఏర్పాటు చేసి ఆక్రమణలను తొలగించారు. మొత్తం 108 గృహాలకుగాను 46 గృహాలను తొలగించారు. ఇంకా మిగిలిన 62 గృహాలు కోర్టులో పెండింగ్‌లో ఉండడం వల్ల నిలుపుదల చేశామన్నారు. కోర్టు క్లియరెన్స్ రాగానే వాటిని కూడా తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు. చాలాకాలం నుంచి నివాసముంటున్నామని బాధితులు కన్నీరు పెట్టుకున్నారు. అధికారులు మాత్రం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు అందించామని చెబుతున్నారు.


గాలాయగూడెంలో నిప్పుల గుండం తొక్కుతున్న భక్తులు

గాలాయగూడెంలో నిప్పులగుండం

» ముగిసిన నాగాశ్విని పేరంటాలమ్మ ఉత్సవాలు

దెందులూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో వెలసిన నాగాశ్విని పేరంటాలమ్మ ఉత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. పిల్లలు లేని వారికి సంతాన లక్ష్మిగా, చీడపీడలతో ఇబ్బందులు పడే వారితో పాటు పలువురు మహిళలు, ఆలయ నిర్వాహకులు పూజారి శ్రీనివాసరావు, కనకదుర్గ, అన్నవరం దుర్గమ్మ దంపతులు బోనాలు సమర్పించి ఆలయం ఎదుట నిప్పులగుండం (అగ్నిగుండం) ఏర్పాటు చేశారు. తొలుత అమ్మవారి విగ్రహంతో నిర్వాహకులు పూజలు నిర్వహించారు. అనంతరం ఛైర్మన్ దంపతులు నిప్పుల గుండం ప్రవేశం చేశారు. వందలాది మంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. భారీ అన్నసమారాధనకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చోరీ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనానికి ద్వారకాతిరుమల వచ్చి తిరుగు ప్రయాణం అవుతున్న ఓ భక్తుని జేబునుంచి సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తి తస్కరించాడు. ద్వారకాతిరుమల ఏఎస్‌ఐ అమీర్ తెలిపిన వివరాలివి.. పెదవేగి మండలం రామన్నపాలెంకు చెందిన మట్టాత అశోక్‌రాజు శనివారం చినవెంకన్న దర్శనా ర్థం ఆలయానికి వచ్చాడు. దర్శనానంతరం స్వగ్రామానికి వెళ్లేందుకు బస్టాండ్‌లో బస్సు ఎక్కేసమయంలో దాదాపు రూ.30వేలు విలువైన సెల్‌ఫోన్ అపరించారని గుర్తించాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

శ్రీవారి సన్నిధిలో భక్తుల కళకళ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయం ఆదివారం భక్తజనులతో కళకళలాడింది. సెలవుదినం కావడంతో పాటు జేఈఈ మెయిన్స్ ఫలితాలు వెలువడడంతో ఉదయం నుంచే ఆలయానికి విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, భక్తుల రాక ప్రారంభమైంది. సుమారు 20 వేల మంది భక్తులు ఆలయానికి వచ్చినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆ తరువాత నిత్యాన్నదాన సదనంలో స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

లక్ష్మీపురంలో కల్యాణోత్సవాలు ప్రారంభం

పురాతన దేవాలయమైన లక్ష్మీపురం ఆలయంలో ఏడు రోజుల పాటు జరిగే శ్రీనివాసుని దివ్య కల్యాణ మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సుందరీకరించారు. ఆలయ ముఖమండపంలోని వేదికపై స్వామి, అమ్మవార్ల కల్యాణమూర్తులకు ప్రత్యేక అలంకారాలు చేశారు. అర్చకులు, పండితులు. ఆగమ విద్యార్థుల వేదమంత్రోచ్చరణల నడుమ శ్రీనివాసుని పెండ్లి కుమారునిగాను, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగాను చేశారు. ఈ వేడుక భక్తజనులను పరవశింపచేసింది.


శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో భక్తులు


లక్ష్మీపురంలో స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేస్తున్న అర్చకులు

పేద ముస్లింలకు న్యాయం జరగాలనే వక్ఫ్ సవరణలు

» కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

భీమవరంటౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పేద ముస్లింలకు న్యాయం జరగాలనే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణల చట్టం తీసుకొచ్చిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం బీజేపీ నరసాపురం పార్లమెంట్ కార్యాలయంలో రాష్ట్ర బీజేపీ ముద్రించిన వక్ఫ్ సవరణ చట్టం ప్రయోజనాలను తెలిపే పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ పోస్టర్లను పశ్చిమ గోదావరి జిల్లా పార్టీ అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, ఇతర నాయకులకు అందజేశారు. అయినంపూడి శ్రీదేవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 20వేల పోస్టర్లను అన్ని మండలాల అధ్యక్షులకు అందజేస్తామన్నారు. భీమవరం తూర్పు అధ్యక్షుడు అడబాల శివ, భీమవరం పడమర అధ్యక్షుడు వబిలిశెట్టి ప్రసాద్, షేక్ మొహిద్దీన్, అరసవల్లి సుబ్రహ్మణ్యం, గోవర్ధన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరించిన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ

క్రైమ్ కార్నర్

బైక్ నుంచి పడి మహిళ మృతి

పెంటపాడు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం ఆలంపురం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. పెంటపాడు మండలం మౌంజీపాడు గ్రామానికి చెందిన బోదనపు నిర్మల (42) తన కుమారుడు దుర్గారావుతో కలిసి అలంపురంలో ఓ పని నిమిత్తం మోటారు సైకిల్‌పై వెళ్లారు. తిరిగి వస్తున్న సమయంలో అలంపురం వద్ద అకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో బైక్ నుంచి పడిపోయారు. ఈ ఘటనలో ఆమె తలకు బలమైన గాయం కాగా చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమార్తె గాయత్రి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ రాజేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంగిడిగూడెంలో నిర్వహిస్తున్న ఓ దాబాలో పనిచేస్తున్న వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ద్వారకాతిరుమల ఎస్‌ఐ సుధీర్ తెలిపిన వివరాలివి.. దాదాపు కొన్నినెలల క్రితం పంగిడిగూడెంలో నడుపుతున్న ఒక దాబాకు ఓ వ్యక్తి వచ్చి తన పేరు పవన్ అని తనది నూజివీడు ప్రాంతమని చెప్పి పనికి కుదిరాడు. ఆ తరువాత అతడు మద్యానికి బానిసై తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో దాబా యజమాని ఆలపాటి జగదీష్ కొన్నాళ్ల క్రితం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చాడు. మృతుడి బంధువుల కోసం ప్రయత్నించగా వివరాలి తెలియలేదు. ఈ క్రమంలో వైద్యం పొందుతూ పవన్ ఈనెల 17వ తేదీ రాత్రి మృతి చెందాడని దాబా యజమాని ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, వివరాలు తెలిసిన వారు 94407 96653కు ఫోన్ చేసి తెలపాలని ఎస్‌ఐ కోరారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు

భీమడోలు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): భీమడోలు మండలం కోరుకొల్లు పంచాయతీ రత్నాపురం గ్రామంలోని రామాలయంలో దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేశామని భీమడోలు పోలీసులు ఆదివారం తెలిపారు. ఈనెల 14వ తేదీ రాత్రి రామాలయంలో గుడి తలుపుల తాళాలు పగులగొట్టి సుమారు 17 గ్రాముల బంగారు ఆభరణాలను కట్టా సుబ్బారావు అనే వ్యక్తి తస్కరించాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా భీమడోలు ఎస్‌ఐ సుధాకర్ 19వ తేదీన గుండుగొలను సమీపంలో ముద్దాయిని అరెస్టు చేసి దొంగతనం చేసిన బంగారాన్ని స్వాధీనపర్చుకుని కోర్టుకు హాజరుపర్చామన్నారు. ముద్దాయిపై ఇప్పటివరకు 60 దొంగతనాలు కేసులు ఉన్నాయని తెలిపారు.

కోళ్ల వ్యర్థాల లారీ పట్టివేత

» వ్యాన్ సీజ్.. ఇద్దరిపై కేసు నమోదు

భీమడోలు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న లారీని భీమడోలు పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. విజయవాడకు చెందిన ఎం.రాంబాబు, పిల్లి వెంకటరమణ, అనే వ్యక్తులు హైదరాబాద్ నుంచి ఓ వ్యానులో కోళ్ల వ్యర్థాలను తరలించి లింగంపాడులో గల ఘంటా మోహనరావు చేపల చెరువుకు తరలిస్తున్నారు. వ్యాన్‌ను సీజ్ చేశామని, నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

డీఎస్సీ నోటిఫికేషన్ చారిత్రక నిర్ణయం

» మంత్రి డాక్టర్ నిమ్మల

పాలకొల్లు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు సందర్భంగా డీఎస్సీ నోటిఫికేషన్ మంత్రి లోకేశ్ విడుదల చేయడం చారిత్రక నిర్ణయం అని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టణంలో 78 రోజులుగా మంత్రి రామానాయుడు ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మంది అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీపై శిక్షణ అందిస్తున్నారు. నోటిఫికేషన్ విడుదల కావడంతో శిక్షణ కేంద్రంలో అభ్యర్థులు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి మంత్రి నిమ్మలకు తినిపించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ ఫ్లెక్సీలకు పాలాభిషేకాలు నిర్వహించారు. ఫౌండేషన్ కన్వీనర్ ఆర్‌వీ అప్పారావు, కోచింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ డి.నాగలింగేశ్వరరావు, పెచ్చెట్టి బాబు, జి.వీరాస్వామి, పీతల శ్రీను, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

పాలకొల్లులో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ గుట్టు రట్టు

» అదుపులో ఇద్దరు.. పరారీలో నిర్వాహకులైన వైసీపీ నేత యడ్ల తాతాజీ, సోదరుడు నాగేశ్వరరావు
» రెండు ప్రత్యేక బృందాల గాలింపు


వివరాలు వెల్లడిస్తున్న నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద

పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు పట్టణంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ గుట్టు రట్టయింది. హైదరాబాద్, విశాఖ కేంద్రాలుగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, బెట్టింగ్ నిర్వాహకులు.. అన్నదమ్ములైన వైసీపీ నాయకులు యడ్ల తాతాజీ, యడ్ల నాగేశ్వరరావు పరారీలో ఉన్నట్టు నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆ అన్నదమ్ములిద్దరూ పదేళ్లుగా బెట్టింగ్ నడుపుతున్నట్టు తెలిపారు. వీరి కోసం రెండు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించామన్నారు. ఆదివారం పట్టణంలోని బ్రాడీపేట బైపాస్ రోడ్డు వద్ద గురుకుల పాఠశాల సమీపంలో టి-జంక్షన్ వద్ద ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులు ఎన్.వెంకట్రావు, వై.వెంకటమురళీకృష్ణను పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు కొంతకాలంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. బెట్టింగ్‌లో పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి చెందిన సాయి, కోటి, అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లికి చెందిన సుబ్రహ్మణ్యం, రాజోలుకు చెందిన హనుమ, మలికిపురానికి చెందిన శ్రీనుతో పాటు పలువురు ఉన్నట్టు సమాచారం ఉందని వారిని త్వరలోనే గుర్తించి అరెస్టు చేస్తామన్నారు. నిందితుల నుంచి రెండు ల్యాప్‌టాప్‌లు, పది మొబైల్ ఫోన్లు, రూ.33 వేల నగదు, ఒక కారు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బెట్టింగ్ ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్న పాలకొల్లు పట్టణ సీఐ కె.రజనీకుమార్, ఎస్‌ఐ ప్రసాద్, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. వైసీపీ నాయకుడు తాతాజీ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ర్యాకెట్టు సూత్రధారిగా వెల్లడికావడం పట్టణంలో సంచలనమైంది. తాతాజీ గత పది రోజులుగా పరారీలోనే ఉన్నట్టు, ఆయన ఫోన్లు స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

నేటి నుంచి శానిటేషన్ పనుల పర్యవేక్షణ

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నగరంలో శానిటేషన్ మెరుగదల కోసం ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు డివిజన్ల వారీగా ఎమ్మెల్యే చంటి పర్యటించనున్నారు. 21వ తేదీ ఉదయం 7వ సర్కిల్‌లో సాయంత్రం 8వ సర్కిల్‌లో పర్యటిస్తారు. 22న 9వ సర్కిల్, సాయంత్రం 10వ సర్కిల్, 23న 11వ సర్కిల్, సాయంత్రం 12వ, 24న 13వ సర్కిల్, సాయంత్రం 14వ సర్కిల్, 25వ తేదీన 15, సాయంత్రం 16 సర్కిల్స్‌లో ఎమ్మెల్యే పర్యటించి శానిటేషన్ పనుల తీరును పర్యవేక్షించనున్నారు.

గ్రంథ పఠనంతో విజ్ఞానాభివృద్ధి

పెదవేగి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : గ్రంథ పఠనంతో విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని పెదవేగి శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్ అన్నారు.పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం చేపట్టారు. పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి, విజ్ఞాన దాయకమైన పుస్తకాలను చదివారు.ఈ సందర్భంగా గ్రంథ పాలకుడు అరుణ్ కుమార్ గ్రంథ పఠనంతో కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి తప్పని సరిగా గ్రంథపఠనం చేయాలని సూచించారు.

రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన

దెందులూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : దెందులూరు పంచాయతీ పరిధిలో ఐదున్నర కిలోమీటర్ల మేర పంగిడిగూడెం వరకు డబుల్ రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, మోతుకూరి నాని బాబు, గారపాటి కొండయ్య చౌదరి, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ తోట యేసమ్మ, ఎంపీటీసీ శేషారత్నం, ఏపీ యాదవ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పెనుబోయిన మహేశ్ యాదవ్, కొండయ్య చౌదరితో కలిసి గ్రామంలోని తామర చెరువును ఎమ్మెల్యే చింతమనేని పరిశీలించారు. ఈ చెరువును మినీ రిజర్వాయర్‌గా తయారు చేసేందుకు ప్రణాళికను రూపొందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బోడేటి మోహన్ బాబు, శ్రీనుబాబు పాల్గొన్నారు.

జనసేన పార్టీలోకి చేరికలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : ఏలూరు 29వ డివిజన్ తాపీ మేస్త్రీ కాలనీ, కుమ్మరిరేవు కాలనీకి చెందిన సుమారు 100 మందికిపైగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు రామిశెట్టి కల్యాణ్, మంగరాజు ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేశారు. ఏలూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్, ఏలూరు జనసేన పార్టీ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు, నాయకులు నారా శేషు, మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్, సీనియర్ నాయకులు రాఘవయ్య చౌదరి హాజరై కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : రాట్నాలకుంటలో కొలువైన శ్రీరాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయార్చకులు పావులూరి వీరవెంకట రామ సత్యనారాయణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీశ్ కుమార్ తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుల స్వీకరణ

ఏలూరు రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే బీసీ రుణాల జాతర మొదలుకాగా, ఎస్సీ రుణాలను అందించేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సబ్సిడీ రుణాలతో స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం నోటిఫికేషన్ ఇవ్వడంతో ఎస్సీ యువత హర్షం వ్యక్తం చేస్తోంది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో 798 యూనిట్లకు గాను రూ.33.18 కోట్లు మంజూరు చేశారు. ఈమేరకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తెలిపారు.

ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలి

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలని కోరుతూ ఈ నెల 21, 22 తేదీల్లో అనంతపురం జిల్లాలో జరిగే ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు ఏలూరు జిల్లా సీపీఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం స్ఫూర్తి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి పథకం కింద పేదలకు సంవత్సరానికి 200 రోజులు పని దినాలు, పనులు కల్పించి రోజు కూలి రూ. 700 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఐ నాయకులు పొటేలు పెంటయ్య, బుగ్గల ప్రభాకర్, అరిగెల యోహాను, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే, నాయకులు ఎ.అప్పలరాజు, పుప్పాల కన్నబాబు, కె.జగన్ పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): 47వ డివిజన్‌లో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మహిళలకు ఎమ్మెల్యే బడేటి చంటి ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ మహిళా సాధికారతకు సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారని అన్నారు. కుట్టుమిషన్ల ద్వారా ఇంటి వద్దే టైలరింగ్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వందనాల దుర్గాభవాని, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతనగూడెం రామాలయంలో భారీ అన్నదానం

పోలవరం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : నూతనగూడెం రామాలయం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత ఆలయంలో సీతా రామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యేటా శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని చేసే ఈ పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాల్లో సుమారు మూడువేల మంది భక్తులు పాల్గొని పూజాధికాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తైలం సత్తిబాబు, చందు, ఫణి, జల్లేపల్లి సుబ్బారావు, మాట్ల కృష్ణ , మేకా పోశిబాబు పాల్గొన్నారు.

మట్టి మాఫియా!

(5వ పేజీ తరువాయి)

అధికారాన్ని అడ్డంపెట్టుకొని మట్టి మాఫియా నియోజకవర్గంలో వీలైన చోట్ల చెరువుల్లో మట్టి అక్రమంగా తరలి స్తోంది. నియోజకవర్గంలో ఒక మూలన ఉండే ఈదర ప్రాంతంలోని పంగిడమ్మ చెరువుపై ప్రస్తుతం ఈ ముఠా చూపు పడింది. నీరులేక ఎండిన వందెకరాల చెరువులో రాత్రివేళ మట్టి తవ్వకాలు సాగిస్తు న్నారు. గ్రామస్తులు అడిగితే బెదిరింపులకు దిగుతున్నారని ఈదర, కొత్త ఈదర, సీతారామపురం గ్రామాల రైతులు చెబుతున్నారు.

రైతులకు తీవ్ర నష్టం : నియోజకవర్గంలో సాగునీటి చెరువుల ఆధారంగా రైతులు పంట పండిస్తారు. చేలలకు నీరు సరఫరా కోసం చెరువు కట్టలలో తూముల ను ఏర్పాటుచేసి ఉంటాయి. చెరువు లోతు నిబంధనలకు మించి పెరిగితే తూములకు నీరందని పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అక్రమ తవ్వకాలతో చెరువుల లోతు పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. చెరువులు నిండినప్పుడు అధిక లోతు వల్ల తమ పంటలకు నీరందని పరిస్థితి ఏర్పడుతుందనే ఆందోళన రైతుల్లో నెలకొంది. మట్టి అక్రమ తవ్వకాలతో లబ్ధిని చూసి ఇతర మండలాల నాయకులకు సైతం దీనిపై దృష్టిసారిస్తున్నారు.

విచారణ జరపాలి : నూజివీడు, గన్నవరం, మైలవరం నియోజకవర్గాల్లోని ఇటుక బట్టీలకు అందుతున్న మట్టి గురించి విజిలెన్స్ విచారణ జరిపితే మట్టి మాఫియా ఆగడాలు, దోపిడీ బయటపడుతుందన పలువురు చెబు తున్నారు. 'సెస్' విధించడం ద్వారా ప్రభుత్వానికి కోల్పోయిన ఆదాయాన్ని ప్రభుత్వం పొందే అవకాశం ఉంటుంది.

'మెగా డీఎస్సీ' మెరిసెన్

(5వ పేజీ తరువాయి)

కేటాయించిన టీచరు పోస్టుల సంఖ్యపై సంబంధిత శాఖల రాష్ట్ర ఉన్నతాధికారులు ప్రకటించాల్సి ఉంది. వీటిని మినహాయిస్తే మెగా డీఎస్సీ-2025లో ఉమ్మడి జిల్లాలో తొలుత ప్రకటించిన 1035 పోస్టుల కంటే అదనంగా మరో 39 (32+7) ఉపాధ్యాయ నియామకాలను చేప డుతున్నట్టు స్పష్టమవుతోంది. జిల్లాస్థాయి నియామకాలు 1074 పోస్టులకు, జోన్-2 పరిధి జిల్లాల్లో మరో 348 పోస్టులకు జోనల్ స్థాయి నియామకాలు మెగా డీఎస్సీ-2025లో జరుగుతాయని చెప్పవచ్చు. ఉపాధ్యాయ నియామకాలు వేర్వేరు యాజమాన్యాలకు జరుగుతున్నా డీఎస్సీ పరీక్షల నిర్వహణమాత్రం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలోనే జరుగుతుండడం గమనార్హం.

సామాజికవర్గాల వారీగా రోస్టర్లు విడుదల

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కావడంతో అభ్యర్థులు ఆదివారం నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం ప్రారంభించారు. జిల్లాల వారీగా ఆయా యాజమాన్యాల పాఠశాలలు, కేడర్లలో సబ్జెక్టులకు భర్తీఅయ్యే పోస్టుల్లో వివిధ సామాజిక వర్గాలకు రోస్టర్ ప్రకారం కేటాయించిన ఖాళీలు, లోకల్/నాన్ లోకల్ రిజర్వేషన్లు, జిల్లా/జోన్‌వారీగా పోస్టుల కేటాయింపులు తదితర సమగ్ర వివరాలను నోటిఫికేషన్‌లో పేర్కొనడంతో అభ్యర్థులు తమస్థానం గురించి బేరీజు వేసుకుంటున్నారు. ఉపాధ్యాయ ఉద్యోగాలకు అప్రెంటీస్ షిప్‌తో సంబంధం లేకుండా నేరుగా రెగ్యులర్ స్కేలులో నియమితులవుతుండడంతో హర్షం వ్యక్తమవుతోంది. జూన్ 6నుంచి జూలై 6 వరకు సీబీటీ విధానంలో ఆన్‌లైన్ పరీక్షలుంటాయి.

గ్రామాల్లో సోలార్..

అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : పర్యావరణ హితమైన సౌర విద్యుత్‌ను పల్లెల్లోను అందరికీ అందుబాటులో తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఇప్పటికే ఏపీఈపీడీసీఎల్ అధికారులు ఆయా గ్రామాలలో గృహాలు అన్ని సోలార్ విద్యుత్ పరికరాల ఏర్పాటు చేసేందుకు రూఫ్‌టాప్ అనుకూలంగా ఉన్నాయా, తదితర వివరాలను సేకరించి గ్రామాలలో సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఏలూరు రూరల్ మండలంలోని 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 600 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇప్పటి వరకు మాదేపల్లి, చాటపర్రు, శనివారంపేట, పరిసర ప్రాంతాలలో 220 గృహాలకు గృహాల లబ్ధిదారుల ఇళ్ళపై 3కెవి, 5కెవి సౌర విద్యుత్ పలకలు అమర్చారు. మిగిలిన వారి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలకు సభ్యత్వాలు ఉన్న మహిళలకు బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేయనున్నారు. మిగిలిన లబ్ధిదారులకు బ్యాంక్ రుణాలు సబ్సిడీలు అందించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. త్వరలో ప్రభుత్వ కార్యాలయాలు, వ్యవసాయ బోర్లు సహా అన్నింటికి సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. గృహాలపై సోలార్ రూఫ్‌టాప్‌లు, వ్యవసాయ పంపుసెట్లుకు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. పల్లెల్లో ప్రజలపై ఆర్థిక భారం తగ్గిందుకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణ సదుపాయాన్ని కల్పిస్తోంది. ఉదయం సమయంలో సౌర విద్యుత్, రాత్రి సమయాల్లో సాధారణ విద్యుత్‌ను వినియోగించేలా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. మిగిలిన విద్యుత్‌ను విద్యుత్ సంస్థకు అమ్ముకునే వెసులుబాటును కల్పిస్తున్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం తరపున బ్యాంక్ లింకేజీ రుణంతో పాటు రాయితీ వర్తిస్తుంది. రెండు కిలోవాట్ల ప్రాజెక్టుకు లక్షా పదివేలు ఖర్చు కానుండగా, దీనికి కేంద్రం 60వేలు రాయితీ ఇస్తుంది. మిగిలిన 50వేలు వినియోగదారులు భరించాలి. ఇంటి అవసరాలకు వాడుకోగా మిగిలిన విద్యుత్ గ్రిడ్‌కు వెళుతుంది.ఒక్కో యూనిట్‌కు రెండు రూపాయిల 9 పైసలు చొప్పున విద్యుత్ సంస్థలు వినియోగదారులకు చెల్లిస్తాయి. ఎస్సీ, ఎస్టీలకు కూడా రాయితీలు ప్రభుత్వం అందజేస్తుంది.



భవనంపై సోలార్ ప్లేట్లు ఏర్పాటు చేసుకున్న దృశ్యం

వృద్ధురాలికి చేయూత

పోలవరం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ గ్రామానికి చెందిన వృద్ధురాలు అనారోగ్యంతో మంచానపడి ఇబ్బందులు పడుతోంది. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ఓ అమ్మకు కష్టం అనే శీర్షికన ప్రచురించిన కథనానికి స్పందించిన దాతలు తమ వంతు సాయం అందజేశారు. పోలవరం మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ.5 వేలు, మరో దాత రూ.10 వేలు అందజేశారు. వార్తా కథనానికి స్పందించిన ఎంపీడీవో సి.హెచ్. శ్రీనివాస్ వృద్ధురాలికి ప్రభుత్వం నుంచి పెన్షన్ అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కదలలేని ఆ వృద్ధురాలికి దాతలు తమవంతు సాయం అందజేయడంతో పాటు అధికారులు పింఛన్ మంజూరు చేసేందుకు ముందుకు రావడంతో వృద్ధురాలు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపింది.



పోలవరంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



కొమ్ముగూడెంలో కేకును కట్ చేస్తున్న నాయకులు



జీలుగుమిల్లిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



ప్రగడవరంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు



టి.నరసాపురంలో కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఏలూరు ఫైర్‌స్టేషన్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద చంద్రబాబు పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించారు. వేడుకల సందర్భంగా ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు.

● ఏలూరు టూటౌన్ : ఏలూరులోని ఎమ్మెల్యే బడేటి చంటి క్యాంపు కార్యాలయంలో చంద్ర బాబు పుట్టిన రోజు వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎంపీ పుట్టా మహేశ్ క్యాంపు కార్యాలయంలో మాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాసరి ఆంజనేయులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేయగా టీడీపీ నేతలు పూజారి నిరంజన్, సీతారామ్ తిలక్, కాట్రు బాలకృష్ణ, రమేశ్, మహేశ్ పాల్గొన్నారు. 5వ డివిజన్‌లోని విహాన్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో అనాథ బాలల మధ్య జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే చంటి ముఖ్య అతిథిగా పాల్గొనగా శెట్టి దాలిరాజు, కె.విటల్, పర్సా రాంబాబు, గంగాధరరావు, రమణ, శ్రీను, గోవర్దన్ హాజరయ్యారు.

● భీమడోలు : స్థానిక గన్ని వీరాంజనేయులు క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భీమడోలు జంక్షన్‌లో వేంకటేశ్వర స్వామి రూపక దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, అవర్ లేడీ హెల్త్ ఆసుపత్రి వద్ద ఉన్న ఆర్సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో శరణాల మాలతీ రాణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● కామవరపుకోట : మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ ఆధ్వర్యంలో చౌతనా సెంటర్‌లో 75 కేజీల కేక్‌ను కట్ చేసి సీఎం చంద్రబాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కామవరపుకోట మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు షేక్ వలీ, బీజేపీ మండలాధ్యక్షుడు రాఘవరాజు సూర్యనారాయణ రాజు, లింగపాలెం టీడీపీ మండలాధ్యక్షులు గరిమెళ్ళ చలపతిరావు, మాజీ ఎంపీపీ ముసునూరి రాము, పట్టణాధ్యక్షులు వజీర్ ఖాన్, సర్పంచ్‌లు గూడపాటి కేశవరావు,వేముల నాగేశ్వరరావు, పసుమర్తి పార్థసారథి బాబు, గోరింక దాసుతో పాటు నాయకులు బొంతు వెంకటేశ్వరరావు, జుజ్జూరి బాబ్జీ, ఘంటా సత్యంబాబు, ఎం.వెంకట్రావు, ఎం.సుందరరావు పాల్గొన్నారు.

● కామవరపుకోట పంచాయతీ కొత్తూరు చెక్ పోస్టు సెంటర్‌లో టీడీపీ స్థూపం వద్ద ఆదివారం సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, కోనేరు వెంకట్రామయ్య(బుజ్జి), కామవరపుకోట మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్ బాబు, జిల్లా నాయకులు మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కొయ్యగూర వెంకటేష్(స్వామినాథం), కోనేరు గార్డెన్స్ అధినేత కోనేరు వెంకట్రామయ్య, నెక్కలపు గంగాధరరావు, ఏలూరు హరిబాబు, నూతి రాటాలు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మురళీ ఆధ్వర్యంలో తొలుత భారీ ర్యాలీ, రక్తదాన శిబిరం నిర్వహించారు. గుంటుపల్లి, జీలకర్రగూడెం, కె.ఎస్.రామవరం, కళ్ళచెరువు, తడికలపూడి, ఆడమిల్లి, రావికంపాడు, తూర్పుయడవల్లి, రామన్నపాలెం గ్రామాల్లోనూ చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

● పెదవేగి/పెదపాడు : దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు పుట్టిన రోజును పురస్కరించు కుని భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, గారపాటి రామసీత, మాగంటి నారాయణ ప్రసాద్, మంచినేని శ్రీనివాసరావు, కొనకళ్ల శివమణి, కమ్మ శివరామకృష్ణ, లావేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. పెదపాడు మండలం అప్పనవీడులో టీడీపీ నాయకులు వేమూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం చంద్రబాబు పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశాజ్యోతి పాఠశాలలో మానసిక విద్యార్థులకు చింతమనేని కుమారుడు ప్రేమ్‌బాబుతో కలిసి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.

● జీలుగుమిల్లి : టీడీపీ మండలాధ్యక్షులు సుంకవల్లి సాయి ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు పుట్టిన రోజును పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. స్థానిక ఆస్పత్రిలో రోగులకు, గర్భిణులకు పాలు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండలాధ్యక్షులు పసుపులేటి రాము, ఎంపీటీసీ నాలి శ్రీను, బండారు అనిల్, గద్దె సుబ్రహ్మణ్యం, తోట బాలు, గుడెల్లి లక్ష్మీనారాయణ, పి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ వి.రాంబాబు, వి.అజయ్ పాల్గొన్నారు.

● టి.నర్సాపురం : స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన పుట్టిన రోజు వేడుకల్లో రాష్ట్ర కార్యదర్శులు జయ్యవరపు శ్రీరామ్మూర్తి, శీలం వెంకటేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు రామకృష్ణారావు గౌడ్, బొంతు సత్యనారాయణ, కొండపల్లి రవి, పిన్నమనేని మధు, జోనుబోయిన సోంబాబు, వాసిరెడ్డి మోహన రావు, సందేపూడి సాయి, అద్దంకి జగ్గారావు, కాళ్నీడి రాంబాబు, కాసనేని మాధవరావు, గండబోయి వెంకట్రావు, కొల్లి మురళీ, కాళ్నీడి వెంకట రత్నం, తదితరులు పాల్గొన్నారు.

● వేలేరుపాడు : స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులు అమరవరపు అశోక్, తమ్మన వెంకటేశ్వరరావు, కరుటూరి రాధాకృష్ణ, శాఖమూరి సంజీవులు, సుధాకర్, శ్రీరాములు ఆధ్వర్యంలో సీఎం పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు.

● బుట్టాయగూడెం : కొమ్ముగూడెం సెంటరులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద, పులిరామువుగూడెం, రెడ్డి గణపవరం, దొరమామిడి, కంద్రికగూడెం, చింతల గూడెం, కె.ఆర్.పురం తదితర గ్రామాల్లో సీఎం చంద్ర బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నాయకులు మొగపర్తి సోంబాబు, యంట్ర ప్రగడ శ్రీనివాసరావు, జారం చాందినీ విద్యాసాగరిక, సున్నం నాగేశ్వరావు, మద్దిపాటి శ్రీనివాస్, చిలకమూడి సుధాకర్ పాల్గొన్నారు.

● చింతలపూడి : స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు కేక్ కట్ చేయగా, భట్టువారిగూడెంలో అనాథ ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ప్రగడవరంలో నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. ఉర్లగూడెంలో నందిపాం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో నాయకులు చిట్లూరి ధర్మరాజు, ఎం.వెంకట్రామయ్య, అట్లూరి శ్రీనివాస రావు, కె.శేషగిరిరావు, టి.చంద్రశేఖరరెడ్డి, కె.రాజారెడ్డి, జనసేన నాయకులు చీదరాల మధుబాబు, బిజెపి నాయకులు తోట వెంకట నారాయణ పాల్గొన్నారు.

● లింగపాలెం : స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ మండలాధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు ఆధ్వర్యంలో 75 కేజీల కేక్ కట్ చేశారు.



కుక్కునూరులో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

అనంతరం ధర్మాజీగూడెం సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మోరంపూడి మల్లికార్జునరావు, ముసునూరి రాము, బొంతు రాంబాబు, సి.హెచ్.రామ్మోహన్‌రావు, మోరంపూడి వరప్రసాద్, పిల్లల శ్రీనివాస్ యాదవ్, డి.వెంకటేశ్వరరావు, జి.సాయి పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: టీడీపీ పట్టణాధ్యక్షుడు రావూరి కృష్ణ సీఎం చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మమత ఆసుపత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఏరియా ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు అందచేశారు.ఈ కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు పారేపల్లి రామారావు, సీనియర్ నాయకులు మండవ లక్ష్మణరావు, పరిమి సత్తిపండు, రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు నంబూరి రామచంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం : సీఎం చంద్రబాబు పుట్టిన రోజును పురస్కరించుకుని బంగారమ్మపేట కనకదుర్గ ఆలయంలో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వృద్ధాశ్రమంలో, ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు బొడ్డు కృష్ణ, పాదం ప్రసాద్, రెల్లి కొండబాబు, మురళి, కర్రి శంకర్రావు, బ్యాటరీ పోశిబాబు తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు : స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ మండలాధ్యక్షుడు మొలిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుక్కునూరులో కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి సీఎం చంద్రబాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముగిసేటి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో టీడీపీ నాయకులు రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, ఉప సర్పంచ్ పిచ్చుక రాజు, రమణ రాజు, పులి శ్రీను, తదితర నాయకులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం : ప్రధాన సెంటర్‌లో టీడీపీ మండలాధ్యక్షుడు పారేపల్లి నరేశ్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు, తెలుగు మహిళా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు టి.రవి, పట్టణాధ్యక్షుడు మాదేపల్లి శ్రీను, బీజేపీ మండలాధ్యక్షుడు బొలిశెట్టి వాసు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బి.చినరాజు పాల్గొన్నారు.

●ద్వారకాతిరుమల: స్థానిక హోటల్లో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కూరాకుల బుజ్జి యాదవ్, తిమ్మాపురంలో పోలిన శ్రీను, ఘంటా శ్రీనివాస రావు, కె.రాంబాబు, దాలయ్య, టి.పద్మవర ప్రసాద్, జి.అచ్యుత రామయ్య, బాలు, మురళి, ద్వారకాతిరుమలలో ఎం.వెంకటేశ్వరరావు, వి.రామారావు, ఆర్.బాలరాజు, రవికుమార్‌ల ఆధ్వర్యంలో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు.



కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు



కామవరపుకోట చౌతనా సెంటర్లో కేక్ కట్ చేస్తున్న మురళి..



చెక్‌పోస్టు సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న కూటమి శ్రేణులు

జిల్లా వ్యాప్తంగా లాడ్జిలలో తనిఖీలు

ఏలూరుక్రైం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా లాడ్జీలను పోలీసులు శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు విస్తృతంగా తనిఖీలు చేశారు. జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు, ఏలూరు సబ్ డివిజన్ పరిధిలోని డీఎస్పీల పర్యవేక్షణలో ఈ తనిఖీలు నిర్వహించారు.అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టి అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించారు. లాడ్జీలలో రికార్డులు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేశారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు చేపట్టారు. అక్రమ మద్యం, సారా, మత్తుపదార్థాల రవా ణాపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి అడుగడుగునా తనిఖీలు చేశారు. ప్రజల భద్ర కోసం నిరంతరం కృషి చేస్తున్నామని అనుమానాస్పద వ్యక్తుల కార్యకలాపాలపై సమాచారం అందించాలని లాడ్జిలో నిర్వాహకులకు సూచించారు. ప్రజలు ఎవరైనా తమకు అనుమానం కల్గితే వెంటనే 112కు సమాచారం అందించాలని కోరారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

ముగిసిన అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాద నివారణ వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 14న జిల్లా అగ్నిమాపక అధికారి వి రామకృష్ణ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాద నివారణ వారోత్సవాలు ప్రారంభించి విస్తృతంగా అవగాహన కల్పించారు.ఆదివారం ఏలూరు, తంగెళ్ళమూడి, పెనియేలు చర్చిలో అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగిన పుడు ఏ విధంగా మంటలను ఆర్పివేయాలో డెమో ద్వారా తెలియజేశారు.



చర్చిలో యువతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చర్చిలలో ఘనంగా ఈస్టర్ ప్రార్థనలు

ఏలూరు టూటౌన్ /ఏలూరు రూరల్/ పెదపాడు/ లింగపాలెం/ పోలవరం/చింతలపూడి/ బుట్టాయగూడెం/ పెదవేగి /జంగారెడ్డిగూడెం : క్రీస్తు పునరుత్థానాన్ని పురస్కరించుకుని ఏలూరు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సండే స్కూల్ విద్యార్థులు ప్రత్యేక గీతాలు ఆలపించారు. అమలోద్భవి శతద్రల్‌లో ఏలూరు కథోలిక పీఠాధి పతులు మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర దివ్యబలి పూజ నిర్వహించి ఈస్టర్ సందేశం అందించారు. ఐసీఎం సెతడ్రల్ చర్చ్‌లో బిషప్ జాన్ ఎస్‌డీ రాజు, మన్నాచర్చిలో బిషప్ ఎం.ఎలీషా రాజు, సీనియర్ పాస్టర్ జ్యోతిరాజు, గేత్సేమనే చర్చ్‌లో పాస్టర్ రెవరెండ్ జీవన్ కుమార్, ఎల్ఈఎఫ్ చర్చిలో బ్రదర్ సురేశ్ మార్కస్, బెనుయేలు చర్చ్‌లో పాస్టర్ జాన్ బాబు, వలివల చర్చ్‌లో పాస్టర్ అడం సురేశ్ క్రీస్తు పునరుద్ధాన సందేశం అందించారు. పెదపాడులోని రక్షణ సైన్యం వారి సమాధుల తోటలో ఆదివారం తెల్లవారు జామున ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.లింగపాలెం ఆర్‌సీఎం, సీఎస్ఐ చర్చిలలో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జుబ్లినగర్ ఆర్సీఎం చర్చ్ ఫాదర్ ఎస్.జె.ఎం. కుమార్ క్రీస్తు బోధనలు వినిపించారు. పోలవరం మండలం కమ్మరగూడెం గ్రామ సమీపంలోని స మాధుల వద్ద పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. పాస్టర్ కాట్రు మోజేస్ ఆధ్వర్యంలో విశ్వాసులు ర్యాలీ నిర్వహించారు. చింతలపూడి మండలం బోయగూడెం చర్చిలో పాస్టర్ కామా మాథ్యూ ఆధ్వర్యంలో ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు. బుట్టాయ గూడెంలోని సెయింట్ మార్కు లూథరన్ దేవాలయం లో పాస్టర్ రెవ. ఎం.ఎ.ఆమెన్ ఈస్టర్ ప్రార్థనలు చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు పాలడుగుల కోటేశ్వరరావు, తలారి రాజు వృద్ధులకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యు.సూర్యప్రకాశ రావు, కె.విమల, బి.పద్మ మాలిని ఎల్‌సీసీ, పీసీసీ సంఘస్థులు పాల్గొన్నారు. పెదవేగి మండలంలోని పలు గ్రామాల్లో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. న్యాయం పల్లి విచారణ గురువు ఫాదర్ రాచూరి బాలస్వామి మాట్లాడుతూ క్రైస్తవులకు క్రిస్మస్ తరువాత ప్రధానమైన పండుగ ఈస్టర్ అని అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో పలు సంఘాల ఆధ్వర్యంలో సమాధుల తోటల్లో ప్రార్థనలు నిర్వహించారు. కొయ్యలగూడెం, గవరవరం, ఆరిపాటి దిబ్బలు, పొంగుటూరు, కన్నాపురం గ్రామాల్లో ప్రార్థనలు చేశారు.



జంగారెడ్డిగూడెంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

నేడు, రేపు వార్షికోత్సవాలు

కామవరపుకోట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : పాతూరులోని గుడ్ల గురవమ్మ ఆలయ పదవ వార్షికోత్సవాలు 21,22 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం, మంగళవారం అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

కోడి పందేలపై దాడి

పెదవేగి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : పినకడిమిలో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడి చేసి, తొమ్మిది మందిని అరెస్టు చేశామని పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. వారి నుంచి 3 కోడి పుంజులు, 7 మోటార్ సైకిళ్లు, రూ.1600లు నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరుస్తామని ఆయన తెలిపారు.

వచ్చే నెల 20న సమ్మెను జయప్రదం చేయాలి

చాట్రాయి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు అందరూ పాల్గొని విజయవంతం చెయ్యాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా కార్యదర్శి డి.పుల్లారావు పిలుపు నిచ్చారు. చాట్రాయి ఆంజనేయస్వామి కమిటీ హాల్‌లో మండల కార్యదర్శి కలపాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపు నిచ్చాయని అన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ పేరుతో బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టటానికి సిద్ధమైందని ఆరోపించారు.

నేటి నుంచి వణుదుర్రులో భూముల రీ సర్వే

ముదినేపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పైలట్ ప్రాజెక్టు రీ సర్వేలో భాగంగా ముదినేపల్లి మండలం వణుదుర్రు రెవెన్యూ విలేజి ఏరియాలో సోమవారం నుంచి భూముల సర్వే ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆ గ్రామ ఏరియాలోని సుమారు 1000 మంది రైతులకు చెందిన 1800 ఎకరాల ఆయకట్టు భూములను సర్వే చేసి సరిహద్దులు, రైతు వారీగా భూమి విస్తీర్ణాన్ని గుర్తిస్తారు. తొలుత వణుదుర్రు గ్రామానికి ఇతర గ్రామాల పొలిమేర్లకు అధికారులు సరిహద్దులు గుర్తిస్తారు.

'మెగా డీఎస్సీ' మెరిసెన్

(5వ పేజీ తరువాయి)

కేటాయించిన టీచరు పోస్టుల సంఖ్యపై సంబంధిత శాఖల రాష్ట్ర ఉన్నతాధికారులు ప్రకటించాల్సి ఉంది. వీటిని మినహాయిస్తే మెగా డీఎస్సీ- 2025లో ఉమ్మడి జిల్లాలో తొలుత ప్రకటించిన 1035 పోస్టుల కంటే అదనంగా మరో 39 (32+7) ఉపాధ్యాయ నియామకాలను చేప డుతున్నట్టు స్పష్టమవుతోంది. జిల్లాస్థాయి నియామకాలు 1074 పోస్టులకు, జోన్-2 పరిధి జిల్లాల్లో మరో 348 పోస్టులకు జోనల్ స్థాయి నియామకాలు మెగా డీఎస్సీ-2025లో జరుగుతాయని చెప్పవచ్చు. ఉపాధ్యాయ నియామకాలు వేర్వేరు యాజమాన్యాలకు జరుగుతున్నా డీఎస్సీ పరీక్షల నిర్వహణమాత్రం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలోనే జరుగుతుండడం గమనార్హం.

సామాజికవర్గాల వారీగా రోస్టర్లు

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కావడంతో అభ్యర్థులు ఆదివారం నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం ప్రారంభించారు. జిల్లాల వారీగా ఆయా యాజమాన్యాల పాఠశాలలు, కేడర్లలో సబ్జెక్టులకు భర్తీఅయ్యే పోస్టుల్లో వివిధ సామాజిక వర్గాలకు రోస్టర్‌ప్రకారం కేటాయించిన ఖాళీలు, లోకల్/నాన్ లోకల్ రిజర్వేషన్లు, జిల్లా/జోన్‌వారీగా పోస్టుల కేటాయింపులు తదితర సమగ్ర వివరాలను నోటిఫికేషన్‌లో పేర్కొనడంతో అభ్యర్థులు తమస్థానం గురించి బేరీజు వేసుకుని పరిశీలించుకుంటున్నారు. ఉపాధ్యాయ ఉద్యోగాలకు అప్రెంటీస్ షిప్‌తో సంబంధం లేకుండా నేరుగా రెగ్యులర్ స్కేలులో నియమితులవుతుండడంతో హర్షం వ్యక్తమవుతోంది. జూన్ 6నుంచి జూలై 6 వరకు సీబీటీ విధానంలో ఆన్‌లైన్ పరీక్షలుంటాయి.

మట్టి మాఫియా!

(5వ పేజీ తరువాయి)

అధికారాన్ని అడ్డంపెట్టుకొని మట్టి మాఫియా నియోజకవర్గంలో వీలైన చోట్ల చెరువుల్లో మట్టి అక్రమంగా తరలి స్తోంది. నియోజకవర్గంలో ఒక మూలన ఉండే ఈదర ప్రాంతంలోని పంగిడమ్మ చెరువుపై ప్రస్తుతం ఈ ముఠా చూపు పడింది. నీరులేక ఎండిన వందెకరాల చెరువులో రాత్రివేళ మట్టి తవ్వకాలు సాగిస్తు న్నారు. గ్రామస్తులు అడిగితే బెదిరింపులకు దిగుతున్నారని ఈదర, కొత్త ఈదర, సీతారామపురం గ్రామాల రైతులు చెబుతున్నారు.

రైతులకు తీవ్ర నష్టం

నియోజకవర్గంలో సాగునీటి చెరువుల ఆధారంగా రైతులు పంట పండిస్తారు. చేలలకు నీరు సరఫరా కోసం చెరువు కట్టలలో తూముల ను ఏర్పాటుచేసి ఉంటాయి. చెరువు లోతు నిబంధనలకు మించి పెరిగితే తూములకు నీరందని పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అక్రమ తవ్వకాలతో చెరువుల లోతు పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. చెరువులు నిండినప్పుడు అధిక లోతు వల్ల తమ పంటలకు నీరందని పరిస్థితి ఏర్పడుతుందనే ఆందోళన రైతుల్లో నెలకొంది. మట్టి అక్రమ తవ్వకాలతో లబ్ధిని చూసి ఇతర మండలాల నాయకులకు సైతం దీనిపై దృష్టిసారిస్తున్నారు.

ఇటుక బట్టీల మట్టిపై విచారణ జరపాలి

నూజివీడు, గన్నవరం, మైలవరం నియోజకవర్గాల్లోని ఇటుక బట్టీలకు అందుతున్న మట్టి గురించి విజిలెన్స్ విచారణ జరిపితే మట్టి మాఫియా ఆగడాలు, దోపిడీ బయటపడుతుందని పలువురు చెబుతున్నారు. 'సెస్' విధించడం ద్వారా ప్రభుత్వానికి కోల్పోయిన ఆదాయాన్ని ప్రభుత్వం పొందే అవకాశం ఉంటుంది.

సుబ్రహ్మణ్య స్వామికి భక్తుల తాకిడి



పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

ముదినేపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మ ణ్యేశ్వరస్వామి దేవస్థానం ఆదివా రం భక్తులతో కిటకిటలాడింది. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు పుట్టలో పాలు పోసి, స్వామిని దర్శించుకుని పూ జలు నిర్వహించారు. మహిళలు నాగ ప్రతిమల వద్ద ప్రత్యేక పూజలు జరిపి, పాల పొంగళ్లతో తమ మొక్కులను తీర్చుకున్నారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి పర్యవేక్షణలో అర్చకులు తోలేటి వీరభద్ర శర్మ, రుద్రపాక బాలగంగాధర్ తిలక్ పూజలు అభిషేకాలు నిర్వహించారు.

మహిళల ఆర్థిక స్వయం ప్రతిపత్తి ప్రభుత్వ ధ్యేయం

ముదినేపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో సామాజిక, ఆర్థిక సాధికారతను ప్రోత్సహించటమే ఎన్‌డీఏ ప్రభుత్వ లక్ష్యమని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముదినేపల్లిలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. సుమారు 140 మంది మహిళలకు మూడు నెలలపాటు ఉచితంగా ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

ఏలూరు ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పంగిడిగూడెంలో నిర్వహిస్తున్న ఓ డాబాలో పని చేస్తున్న వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ద్వారకాతిరుమల ఎస్ఐ సుధీర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పంగిడిగూడెంలో నడుపుతున్న ఒక డాబాకు ఓ వ్యక్తి వచ్చి తన పేరు పవన్ అని తనది నూజివీడు ప్రాంతమని చెప్పి పనికి కుదిరాడు. తర్వాత అతను మద్యానికి బానిసై తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో డాబా యజమాని ఆలపాటి జగదీష్ పవన్‌ను కొన్నాళ్ల క్రితం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చాడు. మృతుని బంధువుల కోసం ప్రయత్నించగా ఫలితం దక్కలేదు. ఈ క్రమంలో వైద్యం పొందుతూ పవన్ ఈనెల 17 రాత్రి మృతి చెందాడని డాబా యజమాని ఆదివారం ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నామని, ఇతడ్ని ఎవరైనా గుర్తిస్తే 9440796 653 నెంబరు ఫోన్ చేసి తెలపాలని ఎస్ఐ కోరారు.







నూజివీడులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి సారథి.. పెదలంకలో వృద్ధులకు అన్నదానం.. మండవల్లి ఆర్సీఎం చర్చిలో ప్రార్థనలు

ఘనంగా క్రీస్తు పునరుత్థాన వేడుకలు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు మార్గం పవిత్రమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని నూజివీడు పట్టణంలోని పెంతెకోస్తు చర్చిలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా క్రైస్తవ పాస్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఆయన వివరించారు.

ముదినేపల్లి: ఈస్టర్ వేడుకలను ముదినేపల్లి మండలంలో క్రైస్తవులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏసు పునరుత్థాన ప్రార్థనలు నిర్వహించారు. ముదినేపల్లిలోని ఆర్‌సీఎం చర్చిలో శనివారం రాత్రి 2 గంటల నుంచి ఆదివారం వేకువ జాము వరకు ఫాదర్ మరియదాసు ఆధ్వర్యంలో క్రైస్తవులు కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు జరిపారు. పెయ్యేరు, సింగరాయపాలెం, కొరగుంటపాలెం, విశ్వనాద్రిపాలెం, పెదపాలపర్రు, గురజ తదితర గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ పండుగను జరుపుకుని సాంప్రదాయ ప్రకారం బెల్లపు పానకం పంపిణీ చేశారు.

కలిదిండి: ఈస్టర్ డే సందర్భంగా కలిదిండి ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెదలంకలో పాస్టర్లు దుగ్గిరాల సామ్యూల్ రాజ్, పంతగాని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. భాస్కరరావుపేట, గుర్వాయిపాలెం, కోరుకొల్లు, కొండూరు గ్రామాల్లో చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు.

మండవల్లి: మండవల్లి ఆర్సీఎం చర్చిలో రెవరెండ్ ఫాదర్ శాంతరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండవల్లి అన్ని చర్చిల్లోనూ ఏసుపునరుత్థాన పండుగను ఘనంగా నిర్వహించారు. చర్చిలు ప్రత్యేక ప్రార్థనతో మారుమోగాయి.

వివాహిత అనుమానాస్పద మృతి

కైకలూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మహిళ అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేసినట్లు కైకలూరు టౌన్ ఎస్ఐ డి.వెంకట్ కుమార్ తెలిపారు. కైకలూరు రైల్వేక్వార్టర్స్‌లో ఏడువాక సురేశ్ నివసిస్తూ రైల్వేలో ఉద్యోగం చేస్తున్నాడు. నాలుగు నెలలు క్రితం విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం వాసి గ్రామానికి చెందిన మేరీ మానస(26)ను పెళ్లి చేసుకున్నాడు. కైకలూరులో ఉద్యోగరీత్యా రైల్వే క్వార్టర్స్‌లో దంపతులు నివసిస్తున్నారు. శనివారం ఉదయం డ్యూటీకి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో అతని భార్య మేరీమానసకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో పక్కపోర్షన్ వారికి ఫోన్ చేసి చూడమనగా వారు తలుపు ఎంతసేపు కొట్టినా తీయలేదు. సాయంత్రం డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన సురేశ్ అప్పటికీ భార్య తలుపు తీయక పోవడంతో వెనక వైపుకు వెళ్లి చూడగా తలుపు తీసి ఉండడాన్ని గమనించి వంట గదిలోని వెళ్లాడు. అక్కడ భార్య విగత జీవిగా పడి ఉండడంతో గుండెపోటుతో పడి పోయినట్లుగా గుర్తించి హుటాహుటిన కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. అయితే మానస పడిపోయే సమయానికి భోజనం చేస్తూ పడిపోయినట్లుగా గుర్తించి గుండెనొప్పా లేదా గొంతు పట్టిందా అనే దాని పై స్పష్టత రాలేదు. అయితే ఆమె మృతి చెందిన సమయానికి నోటినిండా అన్నం ఉన్నట్లు గుర్తించారు.

ప్రభుత్వ విధానాలతో బ్యాంకుల నిర్వీర్యం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆర్థిక విధానాల పేర్లతో ప్రైవేటు రంగ బ్యాంకులను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్వీర్యం చేస్తే కుట్రను చేస్తున్నదని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామారావు విమర్శించారు. నూజివీడు కృష్ణ కోపరేటివ్ బ్యాంక్ వద్ద ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 80వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల ప్రైవేటీకరణ నిరసిస్తూ మే 20వ తేదీ తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి అక్కినేని రాజా, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు, బ్యాంక్ ఉద్యోగులు రామారావు, అక్కినేని ప్రసాద్ పాల్గొన్నారు.





కలిదిండిలో కేక్ కట్ చేస్తున్న కూటమి నాయకులు.. ముదినేపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

నిత్య కృషీవలుడు చంద్రబాబు: మంత్రి పార్థసారథి

కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు

నూజివీడు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు నూజివీడులోని టీడీపీ కార్యాలయంలో మంత్రి కె.పార్థసారథి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి సారథి మట్లాడుతూ సీఎం చంద్రబాబు నిత్య కృషీవలుడన్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి బాట వేసిన గొప్ప నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. త్వరలో చింతలపూడి ప్రాజెక్టు పనులు జరిగేలా, నూజివీడు ప్రజల కలను నెరవేరుస్తామన్నారు. తొలుత సర్వమత ప్రార్థనలు జరిగాయి. భారీ సంఖ్యలో హాజరైన కార్యకర్తల సమక్షంలో భారీ కేక్‌ను మంత్రి కట్ చేశారు.

ముదినేపల్లి: అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు తపన అని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ముదినేపల్లిలోని ఎన్‌డీఏ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించిన సీఎం చంద్రబాబు 75వ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అడ్డంకిగా మారినా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిరాటంకంగా అమలు చేస్తున్నారని, అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చంద్రబాబు లక్ష్యాలని అన్నారు. మండల టీడీపీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, ఎన్‌డీఏ నాయకులు కోడూరు శేషుబాబు, ఈడ్పుగంటి శ్రీనివాస్, పరసా విశ్వేశ్వరరావు, దావు నాగరాజు, బొంగు రవికుమార్ పాల్గొన్నారు.

కైకలూరు: కైకలూరు ట్రావెలర్స్‌బంగ్లాలో వందలాదిమంది ప్రజల సమక్షంలో భారీ కేక్‌ను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కట్ చేశారు. కైకలూరు తాలుకా సెంటర్లో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పెన్మెత్స త్రినాథరాజు, బలే ఏసురాజు, పోలవరపు లక్ష్మీరాణి, పూల రామచంద్రరావు, వీరాబత్తిన సుధా, పి రాధాకృష్ణ పాల్గొన్నారు.

చాట్రాయి: తెలుగుజాతి గర్వించే గొప్ప నేత సీఎం చంద్రబాబు అని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. చాట్రాయి టీడీపీ కార్యాలయం, చాట్రాయి సెంటర్, చనుబండలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు కూటమి శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నారావారిపల్లె నుంచి అమరావతి వరకు ఆయన రాజకీయ ప్రస్థానం స్ఫూర్తిదాయకమని అన్నారు. కూటమి నాయకులు అంబటి సత్యనారాయణ, కమ్ముల కొండలరావు,కంచర్ల హనుమంతరావు, రాయవరపు పుల్లారావు, గద్దం ప్రభాకరరెడ్డి, చీదిరాల మారేశ్వరరావు, బొంతు సతీశ్, ఆదిమూలం శర్మ, కొల్లా శ్రీకాంత్ పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండిలో టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చంద్రబాబు బర్త్ డే కేక్‌ను కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంచారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, మాజీ ఎంపీపీ వలవల రామారావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కురేళ్ల ఏడుకొండలు, వెలమ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బోసు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు జన్మదిన కేకును నూజివీడు మునిసిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, పట్టణ టీడీపీ అధ్యక్షులు మలిశెట్టి జగదీష్ కట్ చేసి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ ఉపాధ్యక్షులు తిరుమలశెట్టి ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్లు యార్లగడ్డ ప్రసాద్ పాల్గొన్నారు.

ముందు చూపున్న నాయకుడు చంద్రబాబు అని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడులోని ఆయన కార్యాలయంలో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముసునూరు: భావితరాల భవిష్యత్‌కు ముందుచూపుతో బాటలు వేసే దిక్సూచి సీఎం చంద్రబాబునాయుడు అని మండల పార్టీ అధ్యక్షులు దేవినేని, నూజివీడు నియోజకవర్గ తెలుగుయువత కార్యాదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్(బాబి) అన్నారు. సీఎం చంద్రబాబు 75వ జన్మదిన వేడుకలకు టీడీపీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముసునూరులో నాయకులు దేవినేని, కొండేటి బాబి, పి.ఆంజనేయులు, గోపవరంలో బొల్లినేని బుజ్జియ్య, ఉప్పలపాటి గణేష్‌లు, చింతలవల్లిలో పాలడుగు నాగేంద్రబాబు, ప్రశాంత్, ఏనుగుదాటి నాగరాజు, పల్లిపాము రవిలు, కాట్రేనిపాడు ఎన్టీఆర్ విగ్రహం వద్ద సర్పంచ్ గద్దల సుహాసిని మోహన్‌రావు, నాయకులు రాపర్ల బాలకృష్ణ, మొక్కపాటి బుజ్జియ్య, రాపర్ల ప్రతాప్, బడిపాటి సాంబయ్య, గూడపాటి ఆజయ్‌కుమార్ తదితరులు 75కేజీల బారీ కేక్‌లను కట్‌చేసి, బాణాసంచా కాల్చి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

మండవల్లి: మండలంలోని భైరవపట్నం ఎన్డీయే పార్టీ కార్యాలయంలో మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు నారగాని వెంకట నాగేశ్వరరావు, ఎన్డీయే నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, సజ్జా సురేష్‌బాబుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు.





చాట్రాయిలో చంద్రబాబు జన్మదిన వేడుకలు.. కేక్ కట్ చేస్తున్న ముద్దరబోయిన

ప్రమాదకరంగా పేరూరు వంతెన

» తుప్పు పట్టిన ఐరన్ ప్లేట్లు » భయం భయంగా రాకపోకలు





వంతెనపై తుప్పు పట్టి లేచిపోతున్న ఇనుప ప్లేట్లు... పోల్ రాజ్ మేజర్ డ్రైన్‌పై రేకులతో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక వంతెన

ముదినేపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పేరూరు గ్రామం వద్ద పోల్‌రాజ్ మేజర్ డ్రెయిన్‌పై ఉన్న వంతెన ప్రమాద స్థితిలో ఉన్నది. దాకరం - పుట్లచెరువు ఆర్అండ్‌బీ రహదారిలో ఈ మేజర్ డ్రెయిన్‌పై ఉన్న పక్కా వంతెన నాలుగేళ్ల క్రితం కూలిపోగా, అప్పట్లో గ్రామస్థులు, రైతులు చిన్నపాటి వాహనాల రాకపోకలకు స్లాబు స్థానంలో ఐరన్ ప్లేట్లు ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి కూలిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవటంతో తాత్కాలిక వంతెనపైనే పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వంతెనకు ఏర్పాటు చేసిన ఐరన్ ప్లేట్లు ప్రస్తుతం తుప్పు పట్టాయి. దీంతో వంతెనపై ప్రమాదకర పరిస్థితి నెలకొన్నది. ద్విచక్ర వాహనం వెళ్తుంటే ఐరన్ ప్లేట్లు క దిలిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో వంతెన మరోసారి కూలిపోయే ప్రమాదం కనిపిస్తున్నది.

వంతెన నిర్మించాలి
పుట్టి మాధవీ రాణి, సర్పంచ్, పేరూరు



పోల్ రాజ్ డ్రెయిన్‌పై కొత్త వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. తాత్కాలిక వంతెనపై రాకపోకలు ప్రమా దకరంగా ఉన్నాయి. రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

వంతెన చాలా అవసరం
రామలక్ష్మి, మాజీ సర్పంచ్



డ్రెయిన్‌పై వంతెన నిర్మాణం చాలా అవసరం. వంతెన కూలిపోయి నాలుగేళ్లు గడిచినా కొత్త వంతెన నిర్మించకపోవటం ఇబ్బందిగా ఉంది.

వైద్య సహాయానికి రూ.లక్ష విరాళం

కైకలూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా చిన్నారి క్యాన్సర్ వైద్య సహాయానికి రూ.లక్ష విరాళాన్ని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజీఎస్ మాల్యాద్రి అందజేశారు. ఆదివారం కైకలూరులో ఈ విరాళాన్ని అందజేశారు. వరహాపట్నం గ్రామానికి చెందిన కాగితాల ఆంక్ష క్యాన్సర్ ట్రీట్‌మెంట్ కోసం మల్యాద్రి మిత్రబందం సహకారంతో నగదును టీడీపీ నేతలు వీరమల్లు నరసింహారావు, కొడాలి వినోద్, పెన్మెత్స త్రినాధరాజు, పోలవరపు లక్ష్మీరాణి తదితరుల సమక్షంలో అందజేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.



రూ.లక్ష విరాళాన్ని అందజేస్తున్న మాల్యాద్రి, టీడీపీ నేతలు



చెత్త తొలగింపు పనులు పర్యవేక్షిస్తున్న డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు

కాలువల్లో చెత్త తొలగింపు

కైకలూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పంటకాలువల్లో చెత్తాచెదారాన్ని యుద్ధప్రాతిపాదికన అధికారులు తొలగించారు. కైకలూరు పంటకాలువలో ఈదురుగాలులకు కూలిన చెట్లను ఎక్స్‌కవేటర్లతో డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు ఆధ్వర్యంలో పనులను చేపట్టారు. అలాగే కాలువల్లోని చెత్తను తొలగింపు పనులను కూలీలతో నిర్వహించారు. డీసీ చైర్మన్ మాట్లాడుతూ మంచినీటి చెరువులు నిండే వరకు రైతులంతా సహకరించాలని కోరారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లా జూనియర్, సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ క్రీడా పోటీలు నూజివీడు విక్టోరియా టౌన్ హాల్లో ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా సబ్ జూనియర్ పోటీలకు మూడు బాలికల జట్లు, 6 బాలుర జట్లు, జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఐదు బాలికల జట్లు, 8 బాలుర జట్లు హాజరయ్యాయి. తొలుత సబ్ జూనియర్ విభాగంలో పోటీలు నిర్వహించగా ఫైనల్స్‌కు విక్టోరియా టౌన్ హాల్, గుడివాడ జట్లు చేరుకున్నాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475